# తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | బుధవారం - 04 - మార్చి - 2026 | సంపుటి : 3 | సంచిక : 275 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in


# భారత్‌కు ఆయిల్ సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నాం: రష్యా

**ప్రస్తుతం భారత్ వద్ద 25 రోజుల చమురు నిల్వలు..**

వ్యూహాత్మక నిల్వలతో కలిపి 40–45 రోజుల అవసరాన్ని తీర్చగల సామర్థ్యం

చమురు, పెట్రోల్, డీజిల్ సరిపడా ఉన్నాయన్న కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్




2లో

# చర్చిద్దామన్నారు..

## కానీ ఆలస్యమైందని చెప్పాను-ట్రంప్

**న్యూఢిల్లీ, మార్చి8(తెలంగాణ ముచ్చట్లు):**

ఇరాన్‌పై యుద్ధం కొనసాగుతున్న వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. చర్చలకు సిద్ధమని ఇరాన్ నేతలు చెప్పారని.. అయితే, ఇప్పటికే ఆలస్యమైందని చెప్పినట్టు పేర్కొన్నారు. ఇరాన్‌నాయకత్వంతోపాటు ఆ దేశ గగనతల రక్షణ, వాయుసేన, నౌకాదళ వ్యవస్థలన్నీ తుడిచిపెట్టుకుపోయినట్టు తెలిపారు.



మిగతా 2లో..



# మూసీ ఆక్రమణలపై చర్యలు ఎందుకు లేవు?: జాగృతి ప్రశ్న

పేదల ఇళ్ల కూల్చివేతలపై ఆగ్రహం.. గాంధీ సరోవర్ ప్రాజెక్టుపై ప్రశ్నలు

అక్రమ నిర్మాణాలపై పోరాటం కొనసాగిస్తామని హెచ్చరిక

**హైదరాబాద్, మార్చి 3 (తెలంగాణ ముచ్చట్లు):**

పేదల ఇళ్లను ఇష్టారాజ్యంగా కూలగొడుతున్న ప్రభుత్వం మూసీ నదిలో అక్రమంగా నిర్మిస్తున్న భారీ భవనాలు ఎందుకు కనిపించవని తెలంగాణ జాగృతి నాయకులు ప్రశ్నించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో చెరువులు, నీటి వనరులను ఆక్రమిస్తూ నిర్మాణాలు జరుగుతున్నాయని పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో 600 మంది అమాయక పేదల ఇళ్లు కూల్చివేసిన ఘటనను ప్రస్తావిస్తూ ప్రభుత్వ తీరును విమర్శించారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టు పేరుతో దాదాపు 20 ఏళ్లుగా నివసిస్తున్న అపార్ట్‌మెంట్ వాసులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరు నెలల పాటు నిలిచిపోయిన ఈ ప్రాజెక్టుకు ఎవరు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. మూసీ నదిలో చేపట్టిన అక్రమ నిర్మాణాలపై ప్రభుత్వం, హైడ్రా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మిగతా 2లో..

## నార్సింగిలో కల్వకుంట్ల కవిత అరెస్టు

అక్రమ వెంచర్లపై ఆందోళన

పోలీసులతో వాగ్వాదం, తోపులాట

కార్యకర్తల నినాదాలు

2లో

# అర్హులందరికీ సంక్షేమం



## 99రోజుల కార్యాచరణకు సీఎం పిలుపు

ప్రభుత్వ ఆసుపత్రులను వైద్య కళాశాలలతో అనుసంధానం

మధ్యాహ్న భోజన పథక బిల్లులు సమయానికి చెల్లించాలని స్పష్టం

పారదర్శకత, సమన్వయం, పర్యవేక్షణతోనే సంక్షేమానికి ఫలితమన్న సీఎం

**హైదరాబాద్, మార్చి 3 (తెలంగాణ ముచ్చట్లు):**

రాష్ట్రవ్యాప్తంగా సంక్షేమ పథకాలు నిజమైన అర్హులందరికీ ఎలాంటి మినహాయింపులు లేకుండా చేరాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కలెక్టర్ల సమావేశంలో మాట్లాడిన ఆయన, ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి పథకం లక్ష్యిత లబ్ధిదారుల వద్దకు చేరడమే అధికార యంత్రాంగం ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. గ్రామస్థాయిలో నిర్వహించే సమావేశాల్లో ప్రతి పథకం ద్వారా లభించే ప్రయోజనాలను ప్రజలకు స్పష్టంగా వివరించాలని సూచించారు. రేషన్ కార్డులు, సన్న బియ్యం సరఫరా, ఇందిరమ్మ ఇళ్లు, రెండు వందల యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి కీలక పథకాల అమలుపై లబ్ధిదారుల అభిప్రాయాలను సేకరించాలని ఆదేశించారు.

మిగతా 2లో..

# రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేయాలి

- సీఎంకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి బహిరంగ లేఖ
- ఖజానా పరిస్థితిపై ప్రశ్నలు
- బడ్జెట్‌కు ముందు స్పష్టత కోరిన కేంద్ర మంత్రి

**హైదరాబాద్, మార్చి 3 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ ఆర్థిక పరిస్థితికి సంబంధించి పూర్తిస్థాయి శ్వేతపత్రం విడుదల చేయాలని కేంద్ర మంత్రి జి కిషన్ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. ఎన్నికల ముందు ఆరు హామీలు, నాలుగు వందల ఇరవై హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక రాష్ట్ర ఖజానా ఖాళీగా ఉందని చెప్పడం వెనుక ఉద్దేశ్యం ఏమిటని ప్రశ్నించారు. ఒకవైపు ఖజానాలో నిధులు లేవని చెబుతూనే, పార్టీ అధిష్ఠానం కోసం వెయ్యి కోట్లు ఇస్తామనడం ఎలా సాధ్యమవుతుందని ఆయన సందేహం వ్యక్తం చేశారు. గత పన్నెండు సంవత్సరాలుగా గౌరవ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధి కోసం లక్షల కోట్ల రూపాయలను ప్రాజెక్టుల రూపంలో కేటాయించిందని పేర్కొన్నారు. మౌలిక సదుపాయాల కోసం కేంద్రం వడ్డీ రహిత రుణాలు అందించినప్పటికీ రాష్ట్రంలో అనుకున్న స్థాయిలో పనులు జరగలేదని విమర్శించారు.



మిగతా 2లో..

## 'మార్చురీలో మృతదేహాన్ని పీక్కుతిన్న కుక్క'..

### ముగ్గురిపై సస్పెన్షన్ వేటు



**మహబూబ్‌నగర్, మార్చి 3 (తెలంగాణ ముచ్చట్లు):**

మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలోని ప్రభుత్వాసుపత్రి మార్చురీలో వ్యక్తి మృతదేహాన్ని కుక్కలు పీక్కుతిన్న ఘటనపై తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఆసుపత్రి సూపరింటెండెంట్ సహా ముగ్గురిని సస్పెండ్ చేసింది.

మిగతా 2లో..

## హెచ్‌సీఏకు వ్యతిరేకంగా జింఖానా గ్రౌండ్స్ వద్ద ఆందోళన

- జింఖానా గ్రౌండ్స్ వద్ద స్పోర్ట్స్ స్టూడెంట్ ఫెడరేషన్ ఆందోళన
- విశాక ఇండస్ట్రీస్‌కు బదిలీ చేసిన రూ.68.73 కోట్లు వెనక్కి తీసుకోవాలని డిమాండ్
- ఆందోళనకారుల అరెస్టు.. తన ప్రమేయం లేదని హెచ్‌సీఏ అధ్యక్షుడు అమర్నాథ్ స్పష్టం

2లో

## బాచుపల్లిలో ఘోర అగ్నిప్రమాదం

- కట్టెల సామగ్రి, ఫర్నిచర్ పూర్తిగా దగ్ధం
- పక్క దుకాణాలకు మంటల వ్యాప్తి, ప్రాంతమంతా దట్టమైన పొగ
- ప్రాణభయంతో బయటకు పరుగులు తీసిన వ్యాపారులు, స్థానికులు
- ఘటనాస్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది

బుధవారం - 04 - మార్చి 2026

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# భారత్‌కు ఆయిల్ సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నాం: రష్యా

(మొదటి పేజీ తరువాయి)

పశ్చిమాసియా సంక్షోభంతో ఇంధనం కొరత ఏర్పడితేభారత్ దేశానికి ఆయిల్ సరఫరా చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని రష్యా ప్రకటించింది. గల్ఫ్ ఉద్రిక్తతలు ప్రపంచ చమురు సరఫరాకు ముప్పు కలిగించే అవకాశం ఉన్నందున నిరంతర సరఫరాకు సిద్ధంగా ఉన్నట్లు రష్యా దౌత్య వర్గాలు వెల్లడించాయి.

ఆరునుంచి 8వారాలపాటు చమురు డిమాండ్ ను తీర్చేందుకు తగినంత ముడి సరుకు, ఇంధన నిల్వలు తమ దగ్గర ఉన్నాయని మిడిల్ ఈస్ట్ లో పెరుగుతున్న సైనిక సంఘర్షణ మధ్య స్వల్పకాలికచమురు సరఫరా అడ్డంకులనుంచి దేశాన్ని కాపాడుతుందని భారత్ చెప్పడంతో రష్యా ఈ హామీ ఇచ్చింది.

భారత్ కు ముడి చమురు, పెట్రోలియం గ్యాస్ దిగుమతులన్నీ సగానిప హర్మూజ్ జలసంధి నుంచి రవాణ అవుతాయి. ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయెల్ దాడుల తర్వాత ఈ సంధిని ద్వారా చమురు రవాణా అంతరాయం ఏర్పడింది. హార్మూజ్ జలసంధి గుండా షిప్పింగ్ ను అడ్డుకుంటామని ఇరాన్ హెచ్చరించింది. బీమా సంస్థల కవరేజ్ ని ఉపసంహరించుకుంది. ఇది ఆయిల్ షిప్‌కదలికలను ప్రభావితం చేసింది.

ప్రస్తుతం మనదేశంలో 25 రోజులకు సరిపడా ముడి చమురు, ఇంధన నిల్వలు మాత్రమే ఉన్నాయి. అదనపు బఫర్ లలో వాణిజ్యనిల్వలు, మంగళూరు, పాదూర్ , విశాఖపట్నం దగ్గర వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలు మొత్తం కలిపి దాదాపు 100 మిలియన్ బ్యారెళ్ల చమురు ఉంది. చమురు సరఫరా ఆగిపోతే ఈ నిల్వలు 40నుంచి 45 రోజుల దిగుమతులను కవర్‌చేయొచ్చు. మిడిల్ ఈస్ట్ లో ఏర్పడిన ఉద్రిక్తతల క్రమంలో చమురు సమస్యను ఎదుర్కొనేందుకు ముడి చమురు, పెట్రోల్, డీజిల్ , ఏటీఎఫ్ వంటి కీలకమైన పెట్రోలియం ఉత్పత్తుల నిల్వలు ఉన్నాయని కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హార్దీప్ సింగ్ పూరి తెలిపారు.

# నార్సింగిలో కల్వకుంట్ల కవిత అరెస్టు

- అక్రమ వెంచర్లపై ఆందోళన
- పోలీసులతో వాగ్వాదం, తోపులాట
- కార్యకర్తల నినాదాలు



**హైదరాబాద్, మార్చి 3 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను పోలీసులు అరెస్టు చేశారు. నార్సింగిలోని ఒక వెంచర్ వద్ద స్థానికులతో కలిసి ఆమె ఆందోళన చేపట్టారు. రియల్ ఎస్టేట్ వ్యాపారుల అక్రమ వెంచర్లపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని హైడ్రాను నిలదీశారు. హైడ్రా బుల్డోజర్లను పంపించే వరకు ఆందోళన విరమించబోమని కవిత హెచ్చరించారు. ఈ నేపథ్యంలో అక్కడికి చేరుకున్న పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకున్నారు. కవితను పోలీసు వాహనాల్లో ఎక్కించే సమయంలో కార్యకర్తలు అడ్డుకునే ప్రయత్నం చేయడంతో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. పోలీసులు, కార్యకర్తల మధ్య వాగ్వాదం, తోపులాట జరిగింది. కార్యకర్తలు న్యాయం కావాలని నినాదాలు చేస్తూ అక్రమ వెంచర్లను కూల్చాలని డిమాండ్ చేశారు. హైడ్రా అధికారులు రంగనాథ్ వెంటనే అక్కడికి రావాలని కోరారు. కవితతో పాటు పలువురు జాగృతి కార్యకర్తలను అరెస్టు చేసిన పోలీసులు నార్సింగ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టు చేసే సమయంలో కవిత చేతికి స్వల్ప గాయం అయినట్లు సమాచారం. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు.

### మూసీ ఆక్రమణలపై చర్యలు ఎందుకు లేవు?: జాగృతి ప్రశ్న

(మొదటి పేజీ తరువాయి)

ఒకే విధంగా చట్టాన్ని అమలు చేయాలని, పేదలపై మాత్రమే కఠిన చర్యలు తీసుకోవడం సరికాదని పేర్కొన్నారు. అక్రమ నిర్మాణాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకునే వరకు తమ పోరాటం కొనసాగుతుందని జాగృతి నాయకులు స్పష్టం చేశారు. ప్రజల ఆస్తులు, నీటి వనరులను రక్షించడమే తమ లక్ష్యమని తెలిపారు.

# బాచుపల్లిలో ఘోర అగ్నిప్రమాదం




**హైదరాబాద్, మార్చి 3 (తెలంగాణ ముచ్చట్లు):** హైదరాబాద్ నగర పరిధిలోని బాచుపల్లి ప్రాంతంలో తీవ్ర అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. బాచుపల్లి పోలీస్ కార్యాలయం సమీపంలోని ప్రగతినగర్ ప్రాంతంలో వరుసగా ఏర్పాటు చేసిన ఫర్నిచర్ దుకాణాల్లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి.

ఒక దుకాణంలో వంట వాయు సిలిండర్ పేలడంతో మంటలు భారీగా ఎగసిపడ్డాయి. దుకాణంలో నిల్వ ఉంచిన కట్టెల సామగ్రి, ఫర్నిచర్ సామాన్లు మంటలకు ఆహుతయ్యాయి. అనంతరం పక్కనే ఉన్న ఇతర దుకాణాలకు కూడా మంటలు వ్యాపించడంతో పరిసర ప్రాంతమంతా దట్టమైన పొగ కమ్ముకుంది. అక్కడ ఉన్న వ్యాపారులు, స్థానికులు ప్రాణభయంతో బయటకు పరుగులు తీశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు.ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలు తెలియాల్సి ఉంది. ఆస్తి నష్టం తీవ్రంగా ఉన్నట్లు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. అధికారులు వివరాలు సేకరిస్తున్నారు.

# అర్హులందరికీ సంక్షేమం

(మొదటి పేజీ తరువాయి)



ప్రభుత్వ చర్యలపై ప్రజల్లో స్పష్టత ఉండేలా పారదర్శక వ్యవస్థను అమలు చేయాలని అన్నారు. లబ్ధిదారుల నుంచి వచ్చే సూచనలు, ఫిర్యాదులను వెంటనే పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. విద్యారంగంలో చేపడుతున్న సంస్కరణలను ప్రజలకు విస్తృతంగా తెలియజేయాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల నాణ్యతను పెంచేందుకు, ఉపాధ్యాయ శిక్షణను బలోపేతం చేయాలని సూచించారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రులను సమీప వైద్య కళాశాలలతో అనుసంధానం చేసి మెరుగైన వైద్య సేవలు అందేలా చేయాలని ఆదేశించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు అందుబాటులో ఉన్న ఆరోగ్య సేవలను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. మధ్యాహ్న భోజన పథకం అమలులో పాల్గొనే సంస్థలకు నెలసరి బిల్లులు సమయానికి చెల్లించాలని స్పష్టం చేశారు. ఆహార నాణ్యత, పిల్లల ఆరోగ్య భద్రతపై రాజీ ఉండకూడదని అన్నారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రజాప్రతినిధులు 99 రోజుల కార్యాచరణలో చురుకుగా పాల్గొని ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. సమన్వయం, పర్యవేక్షణ, పారదర్శకత కలిసొస్తేనే సంక్షేమ కార్యక్రమాలు ఫలవంతమవుతాయని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

# రాజ్యసభ అభ్యర్థులపై టీపీసీసీ చీఫ్ వ్యాఖ్యలు

- బీసీ నేతలకు అవకాశం ఇవ్వాలని అభిప్రాయం
- కార్పొరేట్ శక్తులకే ప్రాధాన్యం ఇచ్చిందని విమర్శ
- మావోయిస్టుల అంశంపై స్పందన



**హైదరాబాద్, మార్చి 3 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాజ్యసభ అభ్యర్థుల ఎంపికపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సమర్థులైన నలుగురు బీసీ నేతలు రాజ్యసభ అవకాశం కోరుతున్నారని, ఒకటి లేదా రెండు స్థానాల కేటాయింపుపై రేపటిలోగా స్పష్టత వచ్చే అవకాశముందని తెలిపారు. గతంలో బీఆర్ఎస్ పార్టీ పెద్దల సభకు కేవలం కార్పొరేట్ శక్తులకే ప్రాధాన్యం ఇచ్చిందని, తెలంగాణ కోసం పోరాడిన నాయకులను విస్మరించిందని ఆయన విమర్శించారు. సామాజిక న్యాయం దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. మార్చి నెలలో కార్పొరేషన్ పదవుల భర్తీ కూడా చేపడతామని వెల్లడించారు. మావోయిస్టుల అంశంపై స్పందిస్తూ, దశాబ్దాలుగా సిద్ధాంతం కోసం పనిచేసిన వారిపై తమకు గౌరవం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం పాకిస్థాన్‌తో చర్చలకు సిద్ధమవుతూనే, మావోయిస్టులతో చర్చలకు నిరాకరించడం సరికాదని వ్యాఖ్యానించారు. ఆపరేషన్ కగార్‌ను కాంగ్రెస్ వ్యతిరేకిస్తోందని స్పష్టం చేశారు.

లొంగిపోయిన మావోయిస్టులు ప్రజాస్వామ్య పద్ధతుల్లో పనిచేయాలనుకుంటే కాంగ్రెస్ పార్టీలోకి సాదరంగా ఆహ్వానిస్తామని మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో భాగస్వామ్యమవడం ద్వారా సమాజానికి మేలు జరుగుతుందని అభిప్రాయపడ్డారు.

## హెచ్‌సీఏకు వ్యతిరేకంగా జింఖానా గ్రౌండ్స్ వద్ద ఆందోళన

**హైదరాబాద్, మార్చి 3 (తెలంగాణ ముచ్చట్లు):** హెచ్‌సీఏ (హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్)కు వ్యతిరేకంగా జింఖానా గ్రౌండ్స్ వద్ద స్పోర్ట్స్ స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. క్రీడాకారులకు అన్యాయం చేసి, ప్రైవేటు వ్యక్తులు డబ్బులు దండుకుంటున్నారని ఆరోపించారు. విశాక ఇండస్ట్రీస్‌కు బదిలీ చేసిన రూ.68.73 కోట్లు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆందోళనకారులను పోలీసులు అరెస్టు చేశారు.

మరోవైపు తనపై వస్తున్న ఆరోపణలను హెచ్‌సీఏ అధ్యక్షుడు అమర్నాథ్ ఖండించారు. తాను బాధ్యతలు తీసుకున్న తర్వాత ఏ చెక్కులపైనా సంతకాలు చేయలేదన్నారు. రూ.68.73 కోట్లు హెచ్‌సీఏ నుంచి కంపెనీకి చెల్లింపులో తన ప్రమేయం లేదన్నారు. తాను బాధ్యతలు తీసుకోకముందే చెల్లింపుల ప్రాసెస్ జరిగిందని చెప్పారు. డబ్బులు చెల్లించాలని కోర్టు ఆదేశించినట్లు అమర్నాథ్ పేర్కొన్నారు.

## రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

అప్పులు లేకుండా ఒక్క రోజు కూడా పాలన సాగించలేని పరిస్థితికి రాష్ట్రాన్ని తెచ్చింది ఎవరో ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. 2014లో మిగులు నిధులతో ఉన్న రాష్ట్రం నేడు అప్పుల భారంలో కూరుకుపోయిందని వ్యాఖ్యానించారు.

మార్చి 16న ప్రారంభం కానున్న బడ్జెట్ సమావేశాలకు ముందే రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై సమగ్ర శ్వేతపత్రం విడుదల చేయాలని తెలంగాణ ప్రజల తరఫున కోరుతున్నట్లు జి కిషన్ రెడ్డి తెలిపారు. ప్రజలకు పారదర్శకతతో పూర్తి వివరాలు వెల్లడించడం ప్రభుత్వ బాధ్యత అని ఆయన పేర్కొన్నారు.

## 'మార్చురీలో మృతదేహాన్ని పీక్కుతిన్న కుక్క'..

(మొదటి పేజీ తరువాయి)

డ్యూటీ డాక్టర్ మునిశాకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. 'మార్చురీలో మృతదేహాన్ని పీక్కుతిన్న కుక్క' శీర్షికన 'ఈనాడు'లో వచ్చిన కథనంపై ప్రభుత్వం స్పందించి ఈ మేరకు చర్యలు తీసుకుంది.

జడ్చర్లలోని పాత ప్రభుత్వ ఆసుపత్రిని మంగళవారం రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్ పరిశీలించారు. మృతదేహాన్ని కుక్కలు పీక్కుతిన్న ఘటనపై ఆయన విచారణ చేపట్టారు. అనంతరం సూపరింటెండెంట్ చంద్రకళ, ఆర్ఎంవో హరినాథ్, డ్యూటీ డాక్టర్ మునీషా, ఎంఎన్ఓ రవిప్రకాష్‌పై సస్పెన్షన్ వేటు వేశారు.

## చర్చిద్దామన్నారు.. కానీ ఆలస్యమైందని చెప్పాను-ట్రంప్

(మొదటి పేజీ తరువాయి)

ఈ మేరకు సొంత సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్‌లో పోస్టు చేశారు. వాల్‌స్ట్రీట్ జర్నల్‌లో వచ్చిన ఓ కథనాన్ని ట్రంప్ ఖండించారు. ఆ పత్రిక అభిప్రాయంతో ఏకీభవించడం లేదన్నారు. అమెరికా ఆయుధ నిల్వలు తక్కువగా ఉన్నాయని, ఎక్కువ కాలం యుద్ధం కొనసాగితే అవి నిండుకునే ప్రమాదం ఉందన్న వార్తలను అధ్యక్షుడు తోసిపుచ్చారు. మధ్యస్థ, ఉన్నతస్థాయి ఆయుధాలు అపరిమిత సంఖ్యలో ఉన్నాయని, అవి చాలా శక్తిమంతమైనవన్నారు.

## గడ్డి మందు నిషేధానికి సంపూర్ణ మద్దతు: ఈటల రాజేందర్



- ఐఎంఏ కార్యాలయంలో సదస్సు
- పారాక్వాట్ నిషేధానికి డిమాండ్
- ఆత్మహత్యలపై ఆందోళన వ్యక్తం

**హైదరాబాద్, మార్చి 3 (తెలంగాణ ముచ్చట్లు):** హైదరాబాద్ కోటిలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కార్యాలయంలో పారాక్వాట్ గడ్డి మందును నిషేధించాలని డిమాండ్ చేస్తూ నిర్వహించిన సదస్సులో ఎంపీ ఈటల రాజేందర్ పాల్గొన్నారు. ఐఎంఏ అధ్యక్షుడు కిషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, వైద్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీలు కడియం కావ్య, బోయినపల్లి వినోద్ కుమార్, వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి తదితరులు హాజరయ్యారు. పెస్టిసైడ్, పెట్రో కెమికల్, ఫార్మాసిటికల్ స్థాయి కమిటీలో సభ్యునిగా ఉన్న ఈటల రాజేందర్ గత సమావేశంలోనే గడ్డి మందు నిషేధం కోరినట్లు తెలిపారు. త్వరలోనే కఠిన చర్యలు ఉంటాయని విశ్వాసం వ్యక్తం చేశారు. గడ్డి మందు తాగిన వారిలో చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు మాత్రమే కాకుండా, అప్పులబాధ, ఉద్యోగ నష్టం, ఆన్లైన్ గేమింగ్ వంటి కారణాలతో యువత కూడా బలవంతంగా ప్రాణాలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలతో కుటుంబాలు ఆర్థికంగా, భావోద్వేగంగా దెబ్బతింటున్నాయని తెలిపారు. సమాజంలో మానవత్వం కంటే డబ్బు ప్రాధాన్యం పెరిగిందని, రాజకీయాలు పక్కనబెట్టి సమాజాన్ని సరిదిద్దే బాధ్యత రాజకీయ నాయకులపై ఉందని ఈటల రాజేందర్ అన్నారు. గడ్డి మందు నిషేధం కోసం ఐఎంఏ చేస్తున్న ప్రయత్నాలకు తన సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు.

## మౌలాలి కమాన్ వద్ద అర్ధరాత్రి రోడ్డు ప్రమాదం యువకుడు మృతి

**మౌలాలి, మార్చి 03 (తెలంగాణ ముచ్చట్లు):**



మౌలాలి కమాన్ పరిసర ప్రాంతంలో అర్ధరాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా, మరో బాలుడు గాయపడ్డాడు.దమ్మాయిగూడ సాయిబాబా నగర్‌కు చెందిన మండల అనిల్ కుమార్ (42), వృత్తి వాటర్ ప్లాంట్ కార్మికుడు, ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఘటన వివరాలు వెలుగులోకి వచ్చాయి. ఆయన తెలిపిన ప్రకారం, మార్చి 3న తన చిన్న కుమారుడు రుషికేష్ (15) తన స్నేహితుడితో కలిసి హలీమ్ తీసుకోవడానికి మౌలాలికి వెళ్లాడు.అర్ధరాత్రి సుమారు 1:30 గంటల సమయంలో మౌలాలి కమాన్‌లోని నూర్ స్కూల్ ఎదురుగా టీవీఎస్ ఎక్సెల్ (ఏపి10 పి7401) వాహనం మరియు కెటిఎమ్ (టీఎస్05 ఎఫ్ఎల్1349) బైక్ ఢీకొన్నాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, కెటిఎమ్ బైక్ రైడర్ అతివేగంగా మరియు నిర్లక్ష్యంగా వ్యతిరేక దిశలో ప్రయాణిస్తూ టీవీఎస్ ఎక్సెల్ ను ఢీ కొట్టాడు.ఈ ప్రమాదంలో కెటిఎమ్ బైక్ రైడర్ దేశ్పక్ శ్రేయంత్ (23), రాంనగర్ నివాసి, ఈసీఐఎల్ లోని హ్యుందాయ్ షోరూమ్‌లో స్టోర్ ఇన్‌ఛార్జ్‌గా పని చేస్తున్నాడు, తీవ్ర గాయాలతో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. గాయపడిన బాలుడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్ కారణంగా ఇలాంటి ప్రమాదాలు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని పోలీసులు సూచించారు.



## డాక్టర్ పత్తిపాటి లక్ష్మీకాంతమ్మకు సేవారత్న అవార్డు..

**ఖమ్మం బ్యూరో, మార్చి 3 (తెలంగాణ ముచ్చట్లు)**

హైదరాబాద్ నగరంలోని బిర్లా ఆడిటోరియం లో మెగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో సేవా కార్యక్రమాలకు గాను డాక్టర్ పత్తిపాటి లక్ష్మీకాంతమ్మకు సేవారత్న అవార్డును ప్రదానం చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ కేంద్రమంత్రి వేణుగోపాల చారి హాజరయ్యారు. విశిష్ట అతిథులుగా డాక్టర్ పల్లె కిషోర్ కుమార్, ఎస్సై సూర్యపేట మరియు హెల్పింగ్ ఫౌండేషన్ డైరెక్టర్ శిరీష రెడ్డి పాల్గొన్నారు. మాతాజీ జయమ్మ సమక్షంలో అవార్డును అందజేశారు.

కార్యక్రమానికి గౌరవ అతిథిగా సినీ నటుడు బాబు మోహన్ హాజరై అభినందనలు తెలిపారు. కళాకారులు, కవులు తదితర ప్రముఖులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. సేవారత్న అవార్డు అందుకోవడం తనకు ఎంతో గర్వ కారణమని డాక్టర్ పత్తిపాటి లక్ష్మీకాంతమ్మ తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సమాజంలో చైతన్యం కల్పించేందుకు కృషి చేస్తానని సభాముఖంగా పేర్కొన్నారు.



## మల్లాపూర్‌లో ఉచిత వైద్య శిబిరం

- కాంగ్రెస్ నాయకుడు నెమలి అనిల్ కుమార్ హాజరు

**మల్లాపూర్, మార్చి 03 (తెలంగాణ ముచ్చట్లు):**

ఉప్పల్ నియోజకవర్గం నాచారం సర్కిల్ మల్లాపూర్ ప్రధాన రోడ్డులో హెల్త్ కేర్ ఫార్మసీ & ల్యాబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఘనంగా నిర్వహించారు. ఈ శిబిరానికి కాంగ్రెస్ నాయకుడు నెమలి అనిల్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు.శిబిరంలో భాగంగా ప్రజలకు ఉచితంగా బీపీ చెకప్, షుగర్ పరీక్షలు, సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించారు. స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. పేద మరియు మధ్యతరగతి కుటుంబాలు వైద్య ఖర్చుల భారంతో ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టినట్లు నెమలి అనిల్ కుమార్ తెలిపారు. సమాజం లో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి శిబిరాలు అవసరమని ఆయన పేర్కొన్నారు. శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించిన వైద్యులు, సిబ్బంది మరియు నిర్వాహకులకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర సేవాదళ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సద్గుణ రావు, డీసీసీ ఎస్సీ సెల్ సలహాదారు పీ.జీ. సుదర్శన్, మల్లాపూర్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి తాండ్ర శ్రీకాంత్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మక్తాల బాల్‌రాజ్ గౌడ్, జాయింట్ సెక్రటరీ వుండం శ్రీనివాస్, పంజాల శ్రీనివాస్ గౌడ్, కోయలకొండ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# బస్తీబాట కార్యక్రమంలో నెమలి అనిల్ పర్యటన

**– మల్లాపూర్ ఓల్డ్ విలేజ్లో ప్రజా సమస్యలపై నేరుగా స్పందన**

**మల్లాపూర్, మార్చి 3 (తెలంగాణ ముచ్చట్లు):**



బస్తీబాట కార్యక్రమంలో భాగంగా నెమలి అనిల్ కుమార్ నాచారం సర్కిల్ మల్లాపూర్ ఓల్డ్ విలేజ్‌లో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక ప్రజలతో నేరుగా మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.కాలనీలోని డ్రైనేజీ, రోడ్లు, వీధి దీపాలు, తాగునీటి సరఫరా వంటి సమస్యలపై ప్రజలు వినతిపత్రాలు అందజేశారు. గ్రామంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించి, పనుల పురోగతిపై అధికారులతో చర్చించారు. పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతంగా పూర్తి చేసి, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించే దిశగా చర్యలు చేపడతామని పేర్కొంటూ, బస్తీబాట కార్యక్రమం ద్వారా ప్రజలకు మరింత చేరువవుతామని అన్నారు .ఈ కార్యక్రమంలో ప్రభాకర్ గౌడ్, శంకర్ గౌడ్, గణేష్ గౌడ్, శేఖర్ గౌడ్, శ్రీకాంత్, అనిల్, భరత్, మల్లాపూర్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ తండ్రా శ్రీకాంత్ రెడ్డి, సీనియర్ నాయకులు మక్తాల బాలరాజ్ గౌడ్, సురేష్ గౌడ్, అశోక్ గౌడ్, అన్వర్, దాసరి సాయి, సాగర్, ప్రవీణ్, సూరి, హరి, కార్తిక్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## పెన్షనర్ల సమస్యలపై జీఎంతో అల్ ఇండియా రైల్వే పెన్షనర్స్ ఫెడరేషన్ భేటీ

**మల్కాజ్గిరి, మార్చి 03 (తెలంగాణ ముచ్చట్లు):**



రైల్వే పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ఆల్ ఇండియా రైల్వే పెన్షనర్స్ వెల్ఫేర్ ఫెడరేషన్ నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ ను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి పి. యుగంధర్‌తో పాటు జి.యస్. బాబు రావు, వి. అరుణ్ కుమార్, వెంకటయ్య, పూర్ణ రావు, సుదర్శన్, నూర్, మురళీకృష్ణలు జీఎంను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. రైల్వే పెన్షనర్లకు సంబంధించిన ఫ్యామిలీ పెన్షన్ సమస్యలు, వైద్య సదుపాయాల లోపాలు, రీయింబర్స్‌మెంట్ ఆలస్యం వంటి పలు అంశాలను జీఎం దృష్టికి తీసుకువచ్చారు. పెన్షనర్ల సంక్షేమానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని జీఎం సానుకూలంగా స్పందించినట్లు ఫెడరేషన్ ప్రతినిధులు వెల్లడించారు.పెన్షనర్లకు న్యాయం చేయడంలో అధికారులు చొరవ చూపాలని, సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఫెడరేషన్ నాయకులు విజ్ఞప్తి చేశారు.





## వైభవంగా వెంకులోనిగుట్ట హేమాద్రి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి గిరి ప్రదక్షిణ

**కీసర, మార్చి 3 (తెలంగాణ ముచ్చట్లు):**

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కీసర సర్కిల్ పరిధిలోని రాంపల్లి దాయరలో వెలసిన హేమాద్రి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం లో మంగళవారం గిరి ప్రదక్షిణ, పల్లకి సేవ అంగరంగ వైభవంగా నిర్వహించారు.ప్రతి పౌర్ణమి రోజున జరిగే ఈ కార్యక్రమం హోలీ పర్వదినం, లక్ష్మీ అమ్మవారి జయంతి యోగం సందర్భంగా విశేషంగా జరిగింది.ఉదయం ఐదు గంటలకు వేదోత్తములు ఆదిత్య శర్మ, శ్రీనివాస్ శర్మల మార్గదర్శకత్వంలో స్వామి వారి విశేష పూజలు నిర్వహించి అనంతరం పల్లకి సేవతో గిరి ప్రదక్షిణ ప్రారంభించారు.గిరిప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు భజనలు, భక్తి గీతాలతో గోవింద నామస్మరణ చేస్తూ వెంకులోనిగుట్ట గిరులను మార్మోగించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ ,మేడ్చల్ నియోజకవర్గ శాసనసభ్యులు, మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి, , శ్రీ సాయి ధామం దత్త పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ రామానంద ప్రభూజీ స్వామి పాల్గొన్నారు.గిరి ప్రదక్షిణ అనంతరం లక్ష్మీ అమ్మవారి జయంతి యోగం సందర్భంగా విశేష లక్ష్మీ పూజను ఆలయ చైర్మన్ కందాడి హనుమంత్ రెడ్డి దంపతులు, ఆలయ ట్రస్ట్ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. లక్ష్మీ అమ్మవారికి గవ్వలతో అభిషేకం చేసి, అనంతరం స్వామీజీ, ఎమ్మెల్యే చేతుల మీదుగా భక్తులకు లక్ష్మీ గవ్వలను పంపిణీ చేశారు. ప్రతి ఇంటిలో లక్ష్మీ గవ్వలు ఉండడం అష్టైశ్వర్య సిద్ధికి కారణమని వేద పండితులు తెలిపారు.వేల సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ దేవాలయ జీర్ణోద్ధరణ కార్యక్రమాన్ని ప్రారంభించిన నిర్వాహకులను ప్రముఖులు ప్రశంసించారు. కార్యక్రమంలో కెవిఎల్‌ఆర్ ఇండస్ట్రియల్ పార్క్ అసోసియేషన్ సభ్యులు, మన్నె ఇంజనీరింగ్ కంపెనీ ప్రతినిధులు, అలియాబాద్ మున్సిపాలిటీ చైర్మన్, వివిధ రాజకీయ పార్టీల రాష్ట్ర నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ ట్రస్టు సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# రంగుల సందడిలో కళావేదిక హోలీ వేడుకలు

**వనపర్తి,మార్చ్3(తెలంగాణ ముచ్చట్లు):**




ఏడు రంగుల సమ్మేళనంతో ప్రకృతి తనను తాను నూతనోత్సాహంతో అలంకరించుకునే కాలంలో జరుపుకునే పండుగే హోలీ అని సాహితీ కళా వేదిక వనపర్తి జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ అన్నారు. మంగళవారం కళావేదిక ఆధ్వర్యంలో హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు .ఈ సందర్భంగా శంకర్ గౌడ్ మాట్లాడుతూ రంగుల పండుగ హోలీ జీవితంలోని కష్టసుఖాలకు ప్రతీకమని పేర్కొన్నారు. ప్రకృతిలో మార్పులు సహజమై వచ్చినట్లే మన జీవితంలోనూ సుఖదుఃఖాలు వస్తూ పోతూ ఉంటాయని, వాటిని ధైర్యంగా ఎదుర్కొంటూ ఆనందంగా ముందుకు సాగడమే హోలీ పండుగ యొక్క అసలు పరమార్థమని తెలిపారు.హోలీ పండుగ మనుషుల మధ్య స్నేహభావం, సౌభ్రాతృత్వం పెంపొందించే విశిష్టమైన వేడుక అని అన్నారు.మధ్యాహ్నం వరకు ఒకరికొకరు రంగులు చల్లుకుంటూ హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. చిన్నా పెద్దా అనే తేడా లేకుండా వయస్సును మరచి అందరూ ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ సంబరాల్లో మునిగిపోయారు. కళావేదిక సభ్యులు, ఆహ్వానితులు కలిసి ఆనందోత్సాహాలతో కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ కార్యక్రమంలో ప్రజా వైద్యశాల డైరెక్టర్ డా. మురళీధర్, కళావేదిక ప్రతినిధులు బైరోజు చంద్రశేఖర్, సత్తార్, బండారు శ్రీనివాస్, గంధం నాగరాజు, డా. శ్యాంసుందర్, ఋత్విక్ రియాన్స్, శివారెడ్డి, ఆర్డీఎస్ సంస్థ నిర్వాహకురాలు చిన్నమ్మ థామస్, శ్రీలక్ష్మి, పావనం చంద్రశేఖర్, నాగేందర్ గౌడ్, పీడీ వెంకట్ గోపినాథ్, శ్రీనివాసులు, మనోహర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.






# ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలే ప్రాధాన్యం.!

**- ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సరిరామ్.**

**సత్తుపల్లి, మార్చి 3 (తెలంగాణ ముచ్చట్లు):**


ప్రయాణికుల భద్రతతో పాటు మెరుగైన సౌకర్యాల కల్పనకే ప్రాధాన్యం ఇస్తున్నామని ఖమ్మం రీజినల్ మేనేజర్ ఏ. సరిరామ్ తెలిపారు. మంగళవారం సత్తుపల్లి ఆర్టీసీ డిపోను సందర్శించిన ఆయన, బస్టాండ్, గ్యారేజీ, బస్సులను పరిశీలించారు.

డిపో ఆదాయం పెంపుపై కండక్టర్లతో ప్రత్యేకంగా చర్చించిన ఆయన, ప్రతి రూట్‌లో ఆదాయ వృద్ధికి కృషి చేయాలని సూచించారు. సేవా ప్రమాణాలు మెరుగుపడితేనే ప్రయాణికుల విశ్వాసం పెరుగుతుందని పేర్కొన్నారు. నేషనల్ సేఫ్టీ వీక్ సందర్భంగా గ్యారేజీ సిబ్బందితో సమావేశమైన ఆయన, ప్రమాదాల నివారణకు పాటించాల్సిన భద్రతా చర్యలను వివరించారు. డిపో అభివృద్ధికి సిబ్బంది సమిష్టి కృషి అవసరమని సూచించారు. అనంతరం హెయిర్ బస్ యజమానులతో సమావేశమై ప్రయాణికులకు నాణ్యమైన సేవలు అందించడంలో సహకరించాలని కోరారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రీజియన్ పరిధిలో అదనపు బస్సులు ప్రవేశపెట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ గురిజాల లక్ష్మీనారాయణ, అసిస్టెంట్ మేనేజర్ పి. ప్రవీణ్ కుమార్, మెకానికల్ ఇంజనీర్ ఎస్. సాహితి, రీజనల్ ఆఫీస్ సిబ్బంది, డిపో ఉద్యోగులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# వనపర్తిలో కేంద్రీయ విద్యాలయానికి గ్రీన్ సిగ్నల్

- 2026-27 నుంచే విద్యాబోధన ప్రారంభం



**వనపర్తి, మార్చ్3(తెలంగాణ ముచ్చట్లు):**

విద్యాపర్తిగా పేరొందిన వనపర్తి కీర్తి కిరీటంలో మరో కలికితురాయి చేరింది. వనపర్తి జిల్లా కేంద్రంలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయి అనుమతులు జారీ చేసింది. 202627 విద్యా సంవత్సరంనుంచే విద్యాబోధన ప్రారంభం కానుంది.నాగవరం శివారులోని యువత శిక్షణ కేంద్రం ప్రాంగణంలో కేంద్రీయ విద్యాలయాన్ని తాత్కాలికంగా ప్రారంభించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది.సంబంధిత దస్త్ర సంఖ్య 39810, ఫైలు సంఖ్య 11072 6 (తెలంగాణ) 2025పాలన1/2274 94ప్రకారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసినట్లు వెల్లడించారు.వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లురవి వినతి మేరకు స్పందించిన కేంద్రీయ విద్యాలయ సంస్థ 03102025న జరిగిన మంత్రివర్గ సమావేశంలో వనపర్తిలో విద్యాలయం ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. అనంతరం 03032026న యువత శిక్షణ కేంద్రం ప్రాంగణంలో పాఠశాల నిర్వహణకు పూర్తిస్థాయి అనుమతులు మంజూరయ్యాయి.ఈ సందర్భంగా ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ కేంద్రీయ విద్యాలయం స్థాపనతో వనపర్తి జిల్లా విద్యారంగంలో మరింత అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. ముఖ్యంగా నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులోకి రానుందని పేర్కొన్నారు. దినదినాభివృద్ధి చెందుతున్న వనపర్తి నియోజకవర్గాన్ని విద్యా, క్రీడా రంగాల్లో రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందేలా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో కృషి చేస్తున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర విద్యాశాఖ మంత్రి, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లురవి, వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తదితరులకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

# ఘనంగా ఖమ్మం ప్రెస్ క్లబ్ 24వ వార్షికోత్సవం

- జర్నలిస్టుల ఐక్యతకు ప్రతీక
- యూనియన్లకు అతీతంగా వేడుక

**ఖమ్మం బ్యూరో, మార్చి 03(తెలంగాణ ముచ్చట్లు)**




ఖమ్మం ప్రెస్ క్లబ్ 24వ వార్షికోత్సవ వేడుకలు మంగళ వారం ఖమ్మం ప్రెస్ క్లబ్ లో ఘనంగా నిర్వహించబడ్డాయి. జిల్లాలోని వివిధ జర్నలిస్టు యూనియన్లకు చెందిన సీనియర్, జూనియర్ విలేకరులు, జర్నలిస్టు నేతలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. తొలుత ప్రెస్ క్లబ్ వ్యవస్థాపక నిర్వాహకులు, సీనియర్ జర్నలిస్ట్ మోత్కూరి వెంకటేశ్వర్లును స్మరించుకుంటూ ఆయన చిత్రపటానికి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు అంతోటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పుష్పాంజలి ఘటించి, నివాళులు అర్పించారు. ఈ వేడుకల సందర్భంగా 5 కిలోల భారీ కేక్‌ను కట్ చేసి జర్నలిస్ట్ లకు పంచిపెట్టారు. స్నేహసౌహార్ద వాతావరణంలో జరిగిన ఈ కార్యక్రమం ప్రెస్ క్లబ్ కుటుంబస్ఫూర్తిని ప్రతిబింబించింది. 24 ఏళ్ల ప్రస్థానంలో ప్రెస్ క్లబ్ సాధించిన విజయాలను స్మరించుకుంటూ, సీనియర్ జర్నలిస్టుల సేవలను గుర్తు చేసుకున్నారు. సభలో ఐజేయు ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు నామ పురుషోత్తం, టీజేఎఫ్ ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి కొరకొప్పుల రాంబాబు, టిడబ్ల్యూజేఎఫ్ ప్రెస్ క్లబ్ (హెచ్2843) అధ్యక్షుడు అంతోటి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మల్లెల శిల్ప తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ప్రెస్ క్లబ్ జర్నలిస్టులకు దేవాలయం లాంటిదన్నారు. బాధితుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి, పరిష్కార మార్గాలు చూపడంలో ప్రెస్ క్లబ్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. జర్నలిస్టుల ఇండ్ల స్థలాలు, హక్కుల సాధనకోసం యూనియన్లకతీతంగా ఇదే తరహాలో ఐకమత్యంతో పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు సంతోష్ చక్రవర్తి, జిల్లా కార్యదర్శి నానబాల రామకృష్ణ, జిల్లా కోశాధికారి అర్వపల్లి నగేష్‌తో పాటు గెంటెల కుమార్, ఎలుగోటి వెంకట్, కప్పల మధు, నల్ల రాకేష్, జిల్లెల్ల మల్లేష్, షేక్ సోనియా, చిన్నంశెట్టి రాంబాబు, బుర్ర శ్రీనివాస్ కళ్యాణం, ప్రగాని గోపీచంద్, షేక్ నాగుల్ మీరా, వేల్పుల జ్యోతి, శీలం కరుణాకర్ రెడ్డి, గౌరవరపు జగదీష్ శ్రీనివాస్, మొగిలి నాగేశ్వరరావు, దునక శ్రీనివాసరావు, మద్దెల చిన్ని, టి.బిక్షం, నీరుడు రాంబాబు, పాగ యోనా, కొండలరావు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం సభ్యులకు భోజన విందు ఏర్పాటు చేశారు.

# మీర్పేట్ హెచ్‌బి కాలనీలో హోలీ వేడుకల్లో భాగంగా కాముడి దహనం

**నాచారం, మార్చి 03 (తెలంగాణ ముచ్చట్లు):**





హోలీ పండుగను పురస్కరించుకుని నాచారం సర్కిల్‌లోని మీర్పేట్ హెచ్‌బి కాలనీ డివిజన్‌లో రాజస్థాని మార్వాడి సంఘం ఆధ్వర్యంలో కాముడి దహన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మాజీ కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్, ఎస్ఐ విజయ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పాత కట్టెలు, పిడుకలతో పెద్ద మంట వెలిగించి కాముడిని దహనం చేశారు.అనంతరం జెరిపోతుల ప్రభుదాస్ మాట్లాడుతూ హోలీ పండుగ చెడుపై మంచి గెలిచిన సంకేతమని పేర్కొన్నారు. మనలోని కామం, అహంకారం, చెడు ఆలోచనలను దహనం చేసి సత్సంకల్పాలతో ముందుకు సాగాలని ఆయన సూచించారు. కాముడి దహనం ఆత్మపరిశుద్ధికి, సత్సంస్కారాల పెంపొందింపుకు ప్రతీకగా భావిస్తారని తెలిపారు.ఈ కార్యక్రమంలో మార్వాడి సంఘం అధ్యక్షుడు కైలాష్ శర్మతో పాటు నరేష్ సాంక్ల, పవన్ కుమార్ శర్మ, బాబులాల్ జీ, సి. సిర్వీ, దుర్గా రామ్, వినోద్ జైన్, బైరో సింగ్, నారాయణ లాల్, నేమిచంద్ కచ్చావ, సోహన్ లాల్ సిర్వీ, దినేష్ టాంక్, నరేష్ ఖండెల్వాల్, చోగారం సిర్వీ, అనిల్ జైన్, ప్రకాష్ చౌదరి, ఓం ప్రకాష్ చౌదరి, పురుషోత్తం తివారి, సునీల్ జీ అశోక్, అనిల్ గుప్తా, దేవేందర్ కుమార్, శేఖర్ గౌడ్ తదితరులు మరియు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా జరిగింది.



# అభివృద్ధి పనులను పర్యవేక్షణ చేసిన మాజీ కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి

**కాలనీల్లో ప్రజలతో కలిసి పరిశీలన**

**కాప్రా, మార్చి 03 (తెలంగాణ ముచ్చట్లు):**

ఉప్పల్ నియోజకవర్గ కాప్రా సర్కిల్ డివిజన్ పరిధిలోని సిఎస్ నగర్ మరియు సింధుర్ కాలనీల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను మాజీ కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి స్థానిక కాలనీవాసులతో కలిసి పర్యవేక్షించారు. భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ, సీసీ రోడ్ల నిర్మాణం, త్రాగునీటి వసతి వంటి పనులను ప్రత్యక్షంగా పరిశీలించి అధికారులకు అవసరమైన సూచనలు చేశారు.ఈ సందర్భంగా కాలనీల అభివృద్ధికి ఆయన కార్పొరేటర్‌గా ఉన్న సమయంలో చేసిన సేవలను గుర్తుచేసుకుంటూ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక అభినందన సభ నిర్వహించారు.కాలనీవాసులు స్వర్ణరాజ్ శివమణికి శుభాకాంక్షలు తెలియజేసి కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక ప్రతినిధులు మాట్లాడుతూ, ఆయన పదవీకాలంలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు, సీసీ రోడ్ల నిర్మాణం, విద్యుత్ సదుపాయం మెరుగుదల, త్రాగునీటి వసతి కల్పన, ఆధునిక పార్కుల నిర్మాణం వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని కొనియాడారు.స్వర్ణరాజ్ శివమణి మాట్లాడుతూ, ప్రజలు చూపుతున్న ఆదరణ తనకు మరింత బాధ్యతను కల్పిస్తోందన్నారు. కాలనీల్లో మిగిలి ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పదవి ఉన్నా లేకున్నా ప్రజా సేవ కొనసాగిస్తానని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో కాప్రా డివిజన్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు పడమటి మల్లారెడ్డి, నరేందర్ గౌడ్, వినయ్ కుమార్, సిఎస్ నగర్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రఘురామ్ రెడ్డి, సింధుర్ కాలనీ అధ్యక్షుడు చంద్రారెడ్డి, ప్రతినిధి సురేష్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# హోలీ రంగులతో యువత హోరాహోరి

**జోగులాంబ గద్వాల, మార్చి03 (తెలంగాణ ముచ్చట్లు):**

రాజోలి మండల కేంద్రంలో హోలీ పండుగ వేడుకలు ఉత్సాహభరితంగా నిర్వహించబడ్డాయి. గ్రామ యువత పెద్ద ఎత్తున పాల్గొని రంగుల సంబరాలతో సందడి చేశారు. ఉదయం నుంచే యువకులు, యువతులు గుంపులుగా చేరి పరస్పరం రంగులు చల్లుకుంటూ ఆనందోత్సాహాలతో పండుగను ఆహ్వానించారు.

గ్రామ వీధులు రంగుల కాంతులతో కళకళలాడాయి. డప్పుల మోతలు, కేరింతల మధ్య యువత ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ హోలీ వేడుకలను మరింత హర్షాతిరేకంగా మార్చారు. స్నేహభావం, ఐక్యతకు ప్రతీకగా నిలిచే ఈ పండుగను అందరూ సామరస్య వాతావరణంలో జరుపుకున్నారు.

పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుంటూ యువత ఆనందాన్ని పంచుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా గ్రామంలో ప్రశాంత వాతావరణంలో హోలీ వేడుకలు ముగిశాయి. రంగుల హర్షధ్వానాలతో రాజోలి మండలం మార్మోగింది.





# హోలీ సంబరాల్లో పాల్గొన్న రామ్ ప్రదీప్

**నాచారం, మార్చి 03 (తెలంగాణ ముచ్చట్లు):**

ఉప్పల్ నియోజకవర్గం నాచారం సర్కిల్ పరిధిలోని మీర్పేట్ హెచ్‌బి కాలనీ డివిజన్ అధ్యక్షుడు రామ్ ప్రదీప్ హోలీ పండుగ సంబరాల్లో ఘనంగా పాల్గొన్నారు. డివిజన్ పరిధిలో కుటుంబ సభ్యులు, స్థానిక ప్రజలతో కలిసి రంగుల పండుగను ఆనందంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా ప్రజలకు హోలీ శుభాకాంక్షలు తెలియజేస్తూ, సఖ్యతా భావంతో, సోదర భావంతో పండుగను జరుపుకోవాలని ఆయన కోరారు. హోలీ పండుగ సమాజంలో ఐక్యతను పెంపొందించే పండుగగా నిలుస్తుందని, భేదాలను మరచి అందరూ కలిసి ఆనందంగా జరుపుకోవాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లో డివిజన్ నాయకులు, యువత, మహిళలు మరియు కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కాజీపేట్ లో రైల్వే ఉద్యోగులపై సిబిఐ కేసు నమోదు

**కాజీపేట్ మార్చి 3 (తెలంగాణ ముచ్చట్లు)**


కాజీపేట్ జంక్షన్ పరిధిలో పనిచేస్తున్న రైల్వే ఉన్నత అధికారులతోపాటు ఉద్యోగులపై సిబిఐ కేసు నమోదు చేయడంతో రైల్వే వర్గాలలో ఈ విషయం చర్చనీయంగా మారింది.




కాజీపేట్ రైల్వే ట్రాక్ మైంటైనెన్స్ లో ఎలాంటి పనులు చేయకుండ నే బిల్లులు వసూలు చేసినట్లు సిబిఐ గుర్తించి చేశారు. ఇందులో ముగ్గురు ఇంజనీర్లు, ఇద్దరు ట్రాక్ మెంటైనర్లు తో సహా ఒక సంస్థ లో పనిచేస్తున్న 8 మంది పై కేసు నమోదు అయిందని వారు తెలిపారు. రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజనీర్ జిపి సింగ్ తో పాటు సంధ్యా కన్స్ట్రక్షన్ ప్రజా ప్రతినిధులపై కేసు నమోదు చేసింది. నకిలీ అటెండెన్స్ రిజిస్టర్లు సృష్టించే పూసగించినట్లు సిబిఐ అధికారులు గుర్తించారు.

# చీర మెడకు చుట్టుకుని ప్రమాదవశాత్తు బాలిక మృతి

**జవహర్ నగర్, మార్చి 3 (తెలంగాణ ముచ్చట్లు):**



జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో కాప్రా ప్రాంతంలో విషాద ఘటన చోటుచేసుకుంది. 8 సంవత్సరాల బాలిక ప్రమాదవశాత్తు ఊయలలో మృతి చెందిన సంఘటన స్థానికంగా కలకలం రేపింది.వివరాల ప్రకారం, టి. నవనీత అనే మహిళకు పవిత్ర (8 సంవత్సరాలు), ఆరాధ్య (7 నెలలు) అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భర్తతో వైవాహిక విభేదాల కారణంగా ఆమె భర్త నుండి వేరుగా ఉంటూ గృహ సేవకురాలిగా పనిచేస్తోంది. పెద్ద కుమార్తె పవిత్ర గత పది రోజులుగా పాఠశాలకు వెళ్లకుండా ఇంట్లోనే ఉన్నట్లు సమాచారం.తేదీ 02.03.2026 సాయంత్రం సుమారు 6గంటల సమయంలో పవిత్ర తన చిన్న చెల్లెలు కోసం చీరతో కట్టిన ఊయలలో ఆడుకుంటూ ఉండగా, తల్లి నవనీత నెల జీతం తీసుకునేందుకు సమీపంలోని ఇంటికి వెళ్లింది. సుమారు గంట తర్వాత తిరిగి వచ్చి చూడగా, పవిత్ర చీర మెడకు గట్టిగా చుట్టుకుని ఊయల నుండి వేలాడుతూ కనిపించినట్లు తెలిపారు.వెంటనే బాలికను సమీపంలోని లైఫ్‌లైన్ హాస్పిటల్ కు తరలించగా, విధుల్లో ఉన్న వైద్యులు బాలిక అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు.

ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బాలిక మృతి స్థానికులను తీవ్రంగా కలచివేసింది.

# ఫిబ్రవరిలో టాప్ కారు ఎవరిదో తెలుసా?



భారతదేశంలో ఫిబ్రవరి 2026 నెలకు సంబంధించిన అత్యధికంగా అమ్ముడైన కార్ల జాబితా విడుదలైంది. ఎస్‌యూవీ, కాంపాక్ట్ సెడాన్ మోడళ్లే మార్కెట్‌లో ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. టాప్ 10 మోడళ్ల మొత్తం అమ్మకాలు 1,70,127 యూనిట్లకు చేరుకోగా, గత ఏడాదితో పోలిస్తే 8.76 శాతం వార్షిక వృద్ధి నమోదైంది. అయితే జనవరితో పోలిస్తే 5.9 శాతం తగ్గుదల కనిపించింది. ఫిబ్రవరిలో అత్యధికంగా అమ్ముడైన కారుగా టాటా నెక్సాన్ నిలిచింది. మొత్తం 19,430 యూనిట్లు విక్రయమయ్యాయి. గత ఏడాదితో పోలిస్తే 26.59 శాతం పెరుగుదల నమోదు చేసింది. రెండో స్థానంలో మారుతి డిజైర్ 19,326యూనిట్లతో నిలిచి 31.52 శాతం వార్షిక వృద్ధిని నమోదు చేసింది. మూడో స్థానంలో టాటా పంచ్ (ఈవీతో కలిపి) 18,748 యూనిట్లు అమ్ముడయ్యాయి. నాలుగో స్థానంలో హ్యుందాయ్ క్రెటా 17,938 యూనిట్లతో నిలిచింది. ఐదో స్థానంలో మారుతి బ్రెజ్జా 17,863 యూనిట్లు నమోదయ్యాయి. ఆరవ స్థానంలో మారుతి ఎర్టిగా 17,807 యూనిట్లు, ఏడో స్థానంలో మారుతి వ్యాగన్ ఆర్ 14,885 యూనిట్లు నమోదయ్యాయి. ఎనిమిదో స్థానంలో మారుతి స్విఫ్ట్ 14,833 యూనిట్లు, తొమ్మిదో స్థానంలో మహీంద్రా స్కార్పియో 14,665 యూనిట్లు అమ్ముడయ్యాయి. పదో స్థానంలో మారుతి బాలెనో 14,632 యూనిట్లతో నిలిచింది.

తయారీదారుల పరంగా చూస్తే మారుతి సుజుకి ఆరు మోడళ్ల ద్వారా మొత్తం 99,346 యూనిట్లను విక్రయించి పరిమాణ పరంగా మొదటి స్థానంలో నిలిచింది. అయితే వార్షిక వృద్ధి కేవలం 2.86 శాతమే. మరోవైపు టాటా మోటార్స్ 27.65 శాతం ఆకట్టుకునే వృద్ధిని నమోదు చేసింది.

అదే సమయంలో హ్యుందాయ్ మోటార్ ఇండియా 9.93 శాతం, మహీంద్రా అండ్ మహీంద్రా 7.69 శాతం వృద్ధిని నమోదు చేశాయి. మొత్తం మీద ఎస్‌యూవీ, ఈవీ విభాగాల్లో డిమాండ్ పెరుగుతున్న ధోరణి స్పష్టంగా కనిపిస్తోంది.



# పహల్గామ్ ఉగ్రదాడి కేసులో కీలక మలుపు

- దాడిలో వినియోగించిన చిత్రీకరణ పరికరాలు
- చైనా సంస్థతో సంబంధాలపై అన్వేషణ
- న్యాయస్థానం అనుమతులతో ముందడుగు

**న్యూఢిల్లీ:** జమ్ము కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో గత ఏడాది జరిగిన ఉగ్రదాడి కేసులో కీలక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ దాడి సమయంలో ఉగ్రవాదులు గో ప్రో హీరో 12 మోడల్ చిత్రీకరణ పరికరాలను వినియోగించినట్లు జాతీయ దర్యాప్తు సంస్థ గుర్తించింది. చైనాకు చెందిన ఏఈ గ్రూప్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థ వద్ద ఈ పరికరాలు ఉన్నట్లు దర్యాప్తులో బయటపడింది. దాడిలో ఉపయోగించిన ఈ పరికరాలు ఎక్కడి నుంచి వచ్చాయనే అంశంపై లోతైన దర్యాప్తు కొనసాగుతోంది. ఘటనా స్థలం నుంచి స్వాధీనం చేసుకున్న గో ప్రో హీరో 12 మోడల్ బ్లాక్ పరికరాల్లోని సమాచారాన్ని వెలికితీయగలిగితే ఉగ్రవాదుల కదలికలు, ప్రణాళికలపై స్పష్టత వచ్చే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు. ఈ క్రమంలో చైనా సహాయం కోరేందుకు జమ్ము కాశ్మీర్ ప్రత్యేక న్యాయస్థానం అనుమతులు మంజూరు చేసింది. గత ఏడాది ఏప్రిల్ 18న పహల్గామ్‌లో ఈ ఉగ్రదాడి జరిగింది. దానికి ఏడాది ముందు చైనాలోని డోంగ్వాన్ నగరంలో ఈ పరికరాలు సక్రియమయ్యాయని దర్యాప్తు అధికారులు గుర్తించారు.

అనంతరం పరికరాల తయారీ సంస్థకు నోటీసులు జారీచేసినప్పటికీ, లావాదేవీలకు సంబంధించిన పూర్తి వివరాలు అందుబాటులో లేవని తెలిసింది. ఈ పరికరాలను ఎవరు కొనుగోలు చేశారు, చివరిగా ఎవరు వినియోగించారు అనే అంశాలపై స్పష్టత కోసం చైనా న్యాయశాఖ అధికారులకు లేఖ రాయాలని జాతీయ దర్యాప్తు సంస్థ నిర్ణయించింది. ఇందుకు భారత గృహ మంత్రిత్వ శాఖ నుంచి ఇప్పటికే అనుమతులు లభించినట్లు సమాచారం. ఈ దర్యాప్తు తదుపరి దశలో అంతర్జాతీయ సహకారం కీలకంగా మారనుంది.



# జాతీయ గీతానికి మౌన నిరసన..

- అంతర్జాతీయ వేదికపై ఇరాన్ మహిళల జట్టు సంచలనం

అంతర్జాతీయ క్రీడా వేదికపై అరుదైన సంఘటన చోటుచేసుకుంది. మహిళల ఆసియా కప్ ప్రారంభ మ్యాచ్‌కు ముందు జాతీయ గీతం ఆలపించే వేళ ఇరాన్ మహిళల ఫుట్‌బాల్ జట్టు ఆటగాళ్లు మౌనంగా నిలబడి నిరసన తెలిపారు. ఈ చర్య ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఇటీవల అమెరికా దాడుల్లో మరణించినట్లు ప్రకటించిన ఇరాన్ సుప్రీం నాయకుడు అయతుల్లా అలీ ఖమేనీ మృతికి నిరసనగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు అంతర్జాతీయ మీడియా వర్గాలు పేర్కొంటున్నాయి.

ఆస్ట్రేలియాలోని గోల్డ్ కోస్ట్ వేదికగా దక్షిణ కొరియాతో జరిగిన ఈ మ్యాచ్‌కు ముందు రెండు జట్లు మైదానంలో వరుసగా నిలబడ్డాయి. సాధారణంగా ప్రతి అంతర్జాతీయ మ్యాచ్‌కు ముందు ఆయా దేశాల జాతీయ గీతాలు ప్రసారం చేయడం ఆనవాయితీ. అయితే ఇరాన్ జాతీయ గీతం వినిపిస్తున్న సమయంలో జట్టు సభ్యులు ఒక్కరూ గీతాన్ని ఆలపించలేదు. వారు గంభీరంగా, ఎటువంటి హావభావాలు లేకుండా నిలబడి తమ మౌన నిరసనను వ్యక్తం చేశారు. ప్రధాన కోచ్ మార్జియే జాఫరీ కూడా ఆటగాళ్లతో పాటు నిలబడి గీతాన్ని ఆలపించకపోవడం గమనార్హం.

ఈ ఘటనతో స్టేడియంలో ఉన్న ప్రేక్షకులు, క్రీడాభిమానులు ఆశ్చర్యానికి గురయ్యారు. సామాజిక మాధ్యమాల్లో ఈ దృశ్యాలు విస్తృతంగా ప్రచారం అయ్యాయి. కొందరు ఆటగాళ్ల ధైర్యాన్ని ప్రశంసిస్తుండగా, మరికొందరు క్రీడలను రాజకీయాలతో ముడిపెట్టకూడదని అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో ఆసియా ఫుట్‌బాల్ సమాఖ్య ప్రతినిధులు పరిస్థితిని సమీక్షించినట్లు సమాచారం. మ్యాచ్ అనంతరం జరిగిన మీడియా సమావేశంలో జట్టు కెప్టెన్ జహ్రా ఘన్బారి, కోచ్ జాఫరీలను ఖమేనీ మరణం గురించి ప్రశ్నించగా, సమాఖ్య ప్రతినిధి జోక్యం చేసుకుని ఆ ప్రశ్నలను నిలిపివేయాలని సూచించారు. ఆటపై మాత్రమే దృష్టి సారించాలని పేర్కొన్నారు. దీనితో ఈ ఘటనపై అధికారిక వ్యాఖ్యలు ఎక్కువగా వెలువడలేదు.

మ్యాచ్ పరంగా చూస్తే, ఆసియాలో బలమైన జట్లలో ఒకటైన దక్షిణ కొరియా ఆధిపత్యం చాటుకుంది. తొలి అర్ధభాగంలో చో యురి గోల్ సాధించి జట్టుకు ఆధిక్యం తీసుకువచ్చింది. విరామం తర్వాత కిమ్ హ్యేరి, కో యో జిన్ మరో రెండు గోల్స్ చేసి దక్షిణ కొరియాకు స్పష్టమైన విజయాన్ని అందించారు. ఇరాన్ జట్టు రక్షణలో కొంత బలహీనత కనిపించగా, దాడి విభాగంలో ప్రయత్నాలు చేసినప్పటికీ ఫలితం రాలేదు.

ఓటమి అనంతరం కోచ్ జాఫరీ మాట్లాడుతూ, దక్షిణ కొరియా అత్యంత బలమైన జట్టని, మ్యాచ్ కఠినంగా ఉంటుందని ముందే అంచనా వేసినట్లు తెలిపారు. రెండో అర్ధభాగంలో వ్యూహాన్ని మార్చి ఒత్తిడి తీసుకువచ్చామని, కానీ కొన్ని కీలక పొరపాట్ల కారణంగా ఫలితం అనుకూలంగా రాలేదని చెప్పారు. అయినప్పటికీ తమ జట్టు ఆత్మవిశ్వాసంతో ఆడిందని పేర్కొన్నారు.

ఈ మౌన నిరసన ఘటనతో అంతర్జాతీయ క్రీడా వేదికపై క్రీడలు, రాజకీయాల అనుసంధానం మరోసారి చర్చకు వచ్చింది. ఇరాన్ మహిళల జట్టు తీసుకున్న ఈ నిర్ణయం భవిష్యత్తులో ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందో అన్నది ఆసక్తికరంగా మారింది.

# ఉపరాష్ట్రపతిని కలిసిన గ్రామీణాభివృద్ధి శాఖ ప్రతినిధులు

- గ్రామీణ రూపాంతరంపై సమగ్ర వివరణ
- ఉపాధి, గృహ నిర్మాణం, అనుసంధానంపై దృష్టి
- గ్రామాల అభివృద్ధే వికసిత భారతానికి పునాది



**న్యూఢిల్లీ:** భారత ఉపరాష్ట్రపతి సి. పి. రాధాకృష్ణన్ను కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, రాష్ట్ర మంత్రి చంద్రశేఖర్ పెమ్మసానితో పాటు శాఖకు చెందిన ఉన్నతాధికారులు నేడు పార్లమెంట్ భవనంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సమావేశంలో గ్రామీణ రూపాంతరం, ప్రజా సంక్షేమం దిశగా అమలు చేస్తున్న పలు కార్యక్రమాలపై ఉపరాష్ట్రపతికి సమగ్రంగా వివరించారు. అందరికీ గృహాలు, గ్రామీణ ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, జీవనోపాధి మెరుగుదల, సామాజిక మౌలిక వసతులు, గ్రామీణ రహదారులు, అనుసంధానం, సామాజిక భద్రత, జలసంరక్షణ, భూసంబంధిత డిజిటల్ ఆధునీకరణ వంటి అంశాలపై చేపడుతున్న చర్యలను వివరించారు.

గ్రామీణాభివృద్ధి రంగంలో అమలవుతున్న పలు ప్రధాన పథకాల పురోగతిపై కూడా అవగాహన కల్పించారు. గ్రామాల అభివృద్ధి దేశ సమగ్ర పురోగతికి మూలస్థంభమని ఉపరాష్ట్రపతి అభిప్రాయపడ్డారు. మహాత్మా గాంధీ పేర్కొన్న "భారతం గ్రామాలలో నివసిస్తుంది" అనే మాటలను ఉదహరిస్తూ గ్రామాల బలోపేతం ద్వారానే దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని తెలిపారు. గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలు రూపాంతరాత్మక ఫలితాలు ఇస్తున్నాయని ఉపరాష్ట్రపతి ప్రశంసించారు. ఉపాధి, నైపుణ్య అవకాశాలను విస్తరించడం ద్వారా వికసిత భారత లక్ష్యాన్ని సాకారం చేయగలమని ఆయన పేర్కొన్నారు.





# యువ మేధస్సులకు ప్రేరణ: ఐఎన్ఎస్ కల్వేని సందర్శించిన ఎన్‌సీసీ కేడెట్లు


- సముద్రంలో అపార అవకాశాల పరిచయం
- నౌకాదళ కార్యకలాపాలపై ప్రత్యక్ష అవగాహన
- నౌకాదళంలో కెరీర్‌పై ఆసక్తి పెంపు

**కొల్లం:** కొల్లం ఎన్‌సీసీ యూనిట్‌కు చెందిన కేడెట్లకు సముద్రంలో అపార అవకాశాల ప్రపంచాన్ని పరిచయం చేస్తూ ఐఎన్ఎస్ కల్వేని నౌకపై ప్రత్యేక సందర్శన ఏర్పాటు చేశారు. భారత నౌకాదళ కార్యకలాపాలు, యుద్ధ సిద్ధత, నౌకపై జీవన విధానం గురించి కేడెట్లు ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం పొందారు. నౌకపై నిర్వహించిన మార్గదర్శక కార్యక్రమంలో అధికారులు వివిధ విభాగాల పనితీరు, అత్యాధునిక సాంకేతిక పరికరాల వినియోగం, సముద్ర భద్రతా విధానాలపై వివరించారు. కేడెట్లు నౌకలోని డెక్, నియంత్రణ విభాగాలు, శిక్షణా సదుపాయాలను పరిశీలించి ఆసక్తి కనబరిచారు. ఈ అనుభవం ద్వారా నౌకాదళంలో సేవ చేసే గౌరవం, క్రమశిక్షణ, జట్టు భావనపై వారికి అవగాహన పెరిగింది. సముద్ర రక్షణలో నౌకాదళం పోషిస్తున్న కీలక పాత్రను అధికారులు వివరించారు. ఈ సందర్శన యువ మేధస్సులకు ప్రేరణనిచ్చి, భారత నౌకాదళంలో చురుకైన, సాహసోపేతమైన కెరీర్‌పై ఆసక్తిని రేకెత్తించినట్లు నిర్వాహకులు తెలిపారు. దేశ సేవలో భాగస్వాములు కావాలనే సంకల్పంతో కేడెట్లు కార్యక్రమాన్ని ముగించారు.

# రైల్ భవన్‌లో రామ్మోహన్ నాయుడు–అశ్విని వైష్ణవ్ భేటీ

- సౌత్ కోస్ట్ రైల్వే జోన్ కార్యకలాపాలపై చర్చ
- శ్రీకాకుళం రైల్వే మౌలిక సదుపాయాల బలోపేతం
- ఎయిర్–రైల్ అనుసంధానంపై ప్రతిపాదనలు





**న్యూఢిల్లీ:** న్యూఢిల్లీ రైల్ భవన్‌లో కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్తో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు కింజరాపు భేటీ అయ్యారు. ధోలేరా అంతర్జాతీయ విమానాశ్రయం పురోగతి, విశాఖపట్నం కేంద్రంగా సౌత్ కోస్ట్ రైల్వే జోన్ కార్యకలాపాల ప్రారంభంపై చర్చించినట్లు తెలిపారు. శ్రీకాకుళం జిల్లాలో రైల్వే మౌలిక సదుపాయాల బలోపేతంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు వెల్లడించారు. శ్రీకాకుళం నుండి సికింద్రాబాద్, తిరుపతికి నేరుగా రైళ్లు నడపడం, మందస రోడ్, పాతపట్నం, హరిశ్చంద్రపురం స్టేషన్లలో కీలక నిలుపుదలలు కల్పించడం, కామేశ్వరీపేట హాల్ట్ స్టేషన్ అభివృద్ధి, హరిశ్చంద్రపురం స్టేషన్‌ను లాజిస్టిక్స్ కేంద్రంగా అభివృద్ధి చేయడం వంటి అంశాలపై ప్రతిపాదనలు సమర్పించినట్లు చెప్పారు. కొత్త రైల్వే ఓవర్ బ్రిడ్జ్‌లు, అండర్ బ్రిడ్జ్‌లు నిర్మించడం, స్టేషన్లలో ప్రయాణికుల సౌకర్యాల మెరుగుదలపై కూడా చర్చ జరిగింది. మంత్రి గారితో కలిసి కంట్రోల్ రూమ్‌లో పనితీరును సమీక్షించి, ప్రయాణికుల భద్రతకు తీసుకుంటున్న చర్యలపై వివరాలు తెలుసుకున్నట్లు తెలిపారు. ధోలేరా అభివృద్ధికి అనుగుణంగా రైల్వే మౌలిక వసతులను సమన్వయం చేస్తూ, భవిష్యత్ విస్తరణకు అనుకూలంగా ఎయిర్-రైల్ అనుసంధానంపై కూడా చర్చించామని పేర్కొన్నారు. గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో సమగ్ర మల్టీమోడల్ కనెక్టివిటీ ద్వారా దేశ నిర్మాణాన్ని వేగవంతం చేయడమే లక్ష్యమని స్పష్టం చేశారు.

# గల్ఫ్ ఉద్రిక్తతలపై ఒమన్, కువైట్ నేతలతో మోదీ సంభాషణ

- గల్ఫ్ ప్రాంత భద్రతపై చర్చ
- భారతీయుల రక్షణకు ప్రాధాన్యం
- దౌత్య మార్గాల ద్వారానే పరిష్కారం

**న్యూఢిల్లీ:** ఇరాన్, ఇజ్రాయెల్-అమెరికా మధ్య నెలకొన్న యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఒమన్ సుల్తాన్, కువైట్ యువరాజుతో దూరవాణి సంభాషణలు నిర్వహించారు. గల్ఫ్ ప్రాంతంలో కొనసాగుతున్న సంఘర్షణ, అక్కడి భారతీయుల భద్రత అంశాలపై చర్చించినట్లు ప్రధానమంత్రి కార్యాలయం వెల్లడించింది. కువైట్ యువరాజు సబా అల్ ఖలీద్ అల్ సబాతో ప్రధాని మోదీ ఫోన్‌లో మాట్లాడి గల్ఫ్ దేశాలపై జరుగుతున్న దాడులపై ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాంతంలో శాంతి భద్రతలు నిలబెట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై పరస్పరం అభిప్రాయాలు పంచుకున్నారు.

ఒమన్ సుల్తాన్‌తోనూ ప్రధాని మోదీ సంభాషించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. గల్ఫ్ ప్రాంతంలో ఉన్న భారతీయుల రక్షణకు అత్యున్నత ప్రాధాన్యం ఇస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. పరిస్థితులను నిశితంగా పరిశీలిస్తున్నామని తెలిపారు. చర్చలు, దౌత్య మార్గాల ద్వారానే సమస్యలకు పరిష్కారం సాధ్యమని భారత్ పునరుద్ఘాటించింది. ఇరు పక్షాలు సంయమనం పాటించి ఉద్రిక్తతలను తగ్గించాలని విదేశాంగ మంత్రిత్వ శాఖ కోరింది. పౌరుల భద్రత, ప్రాంతీయ స్థిరత్వం అత్యంత ముఖ్యమని స్పష్టం చేసింది.



# యుద్ధం ఎవరికీ మేలు చేయదు

- శాంతి మార్గమే పరిష్కారం
- ప్రపంచాన్ని కలవరపెడుతున్న దేశాల మధ్య ఉద్రిక్తతలు
- ఉద్రిక్తతల అగ్ని చెలరేగితే ప్రపంచానికే ముప్పు
- అమాయకుల ప్రాణాలు బలి
- ఆర్థిక వ్యవస్థలపై తీవ్ర ప్రభావం
- ఆయుధాల కంటే సంభాషణకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన సమయం



ప్రపంచంలోని పలు ప్రాంతాల్లో దేశాల మధ్య ఉద్రిక్తతలు ప్రమాదకర దశకు చేరుతున్నాయి. ఒక దేశం తీసుకునే కఠిన నిర్ణయం మరొక దేశం ప్రతిస్పందనకు దారి తీస్తూ, పరిస్థితి నియంత్రణకు అందకుండా పోయే ప్రమాదం కనిపిస్తోంది. చరిత్ర చెబుతున్న స్పష్టమైన సత్యం ఏమిటంటే యుద్ధం ప్రారంభించడం సులభం, కానీ దాన్ని ఆపడం అత్యంత క్లిష్టం. ఒకసారి ఆయుధాలు మోగితే, దాని ప్రభావం సరిహద్దులు దాటి ప్రపంచవ్యాప్తంగా ప్రతిధ్వనిస్తుంది. యుద్ధం మొదలైన క్షణంలోనే మొదటి బలులు అమాయక పౌరులే. ఇళ్లు కూలిపోతాయి, కుటుంబాలు చెదిరిపోతాయి, పిల్లల భవిష్యత్తు చీకటిలో మగ్గుతుంది. శరణార్థుల ప్రవాహం పెరుగుతుంది. ఆహారం, నీరు, ఔషధాల కొరత తీవ్రమవుతుంది. మానవత్వం అనే విలువే పరీక్షకు గురవుతుంది. శక్తి ప్రదర్శన పేరుతో జరిగే ఈ ఘర్షణలు చివరికి మానవ సమాజానికే శాపంగా మారుతాయి. ఇది కేవలం ఒక ప్రాంతానికే పరిమితమయ్యే సంక్షోభం కాదు; ప్రపంచ స్థిరత్వానికే సవాల్. ఆర్థిక రంగంపై యుద్ధ ప్రభావం మరింత ప్రమాదకరం. చమురు ధరలు పెరుగుతాయి, సరఫరా వ్యవస్థలు దెబ్బతింటాయి, ద్రవ్యోల్బణం అదుపు తప్పుతుంది. అభివృద్ధి చెందుతున్న దేశాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటాయి. పెట్టుబడులు తగ్గిపోతాయి, ఉపాధి అవకాశాలు క్షీణిస్తాయి. ఒక దేశం మధ్య జరిగే ఘర్షణ ప్రపంచ మార్కెట్లను కుదిపేస్తుంది. దీని మూల్యం చివరికి సామాన్య ప్రజలే చెల్లించాల్సి వస్తుంది. ఇప్పటికైనా ప్రపంచ నాయకులు అప్రమత్తంగా ఆలోచించాలి. ఆయుధ పోటీలు, అణు హెచ్చరికలు, కఠిన ప్రకటనలు సమస్యలకు పరిష్కారం కావు. రాజనీతిక చర్చలు, పరస్పర గౌరవం, సహనం ఇవే శాశ్వత శాంతికి మార్గం. యుద్ధం ద్వారా గెలిచిన విజయాలు తాత్కాలికం మాత్రమే; కానీ శాంతి ద్వారా సాధించిన ఒప్పందాలు తరతరాలకు నిలుస్తాయి. ప్రపంచం మళ్లీ విధ్వంసపు అంచున నిలవకూడదంటే ఇప్పుడే సంభాషణకు, సమన్వయానికి ప్రాధాన్యం ఇవ్వాలి. యుద్ధం ఎవరికీ మేలు చేయదు శాంతి మార్గమే సమస్త మానవాళికి నిజమైన రక్షణ.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక



## స్వదేశానికి 149 మంది భారతీయులు

- మధ్యప్రాచ్య ఉద్రిక్తతల మధ్య 149 మంది భారతీయుల రక్షణ
- ప్రత్యేక చర్యలో తొలి విమానం ఢిల్లీ చేరిక
- సిబ్బందితో కలిపి మరో ప్రత్యేక రాక
- భద్రతే ప్రథమ కర్తవ్యం అంటున్న సంస్థ

**న్యూఢిల్లీ:** మధ్యప్రాచ్యంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా దుబాయ్‌లో చిక్కుకుపోయిన 149 మంది భారతీయులను ప్రభుత్వ రంగ విమానయాన సంస్థ సురక్షితంగా స్వదేశానికి తీసుకొచ్చింది. ప్రత్యేక చర్యలో భాగంగా నడిపిన విమానం మంగళవారం ఉదయం 10 గంటల 58 నిమిషాలకు ఢిల్లీ విమానాశ్రయంలో సురక్షితంగా దిగినట్లు సంస్థ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఆ విమానంలో మొత్తం 149 మంది ప్రయాణికులు ఉన్నట్లు తెలిపింది. ప్రస్తుత సంక్షోభ పరిస్థితుల్లో చిక్కుకుపోయిన భారతీయులను స్వదేశానికి తీసుకువచ్చిన తొలి భారతీయ విమానం ఇదే కావడం గమనార్హం. దుబాయ్‌లో చిక్కుకున్న వారిని స్వాగతిస్తున్నామని సంస్థ పేర్కొంది. ప్రయాణికుల కుటుంబ సభ్యులు ఢిల్లీ విమానాశ్రయంలో భావోద్వేగంతో స్వాగతం పలికిన దృశ్యాలు కనిపించాయి.

ఇదే ప్రత్యేక చర్యలో భాగంగా అంతకుముందు మరో విమానం కూడా ఢిల్లీకి చేరుకుంది. ఆ విమానంలో దుబాయ్‌లో చిక్కుకుపోయిన ఎయిర్ ఇండియా, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్‌కు చెందిన 143 మంది పైలట్లు, సిబ్బందిని సురక్షితంగా తరలించారు. వారంతా సురక్షితంగా తిరిగి రావడంతో కుటుంబ సభ్యులు, సంస్థ యాజమాన్యం ఊపిరి పీల్చుకుంది. ఈ ప్రత్యేక విమానాలను నడిపేందుకు తమ నిర్వహణ నియంత్రణ కేంద్రం, ఇతర సహాయక బృందాలు రాత్రింబవళ్లు పనిచేశాయని సంస్థ వెల్లడించింది. అసాధారణ పరిస్థితుల్లోనూ తరలింపు ప్రక్రియను విజయవంతం చేసేందుకు సంబంధిత అధికారులతో నిరంతరం సమన్వయం కొనసాగించినట్లు తెలిపింది. ప్రయాణికులు, సిబ్బంది భద్రతే తమకు అత్యంత ప్రాధాన్యమని స్పష్టం చేసింది. అవసరమైన అనుమతులు లభించిన వెంటనే మరిన్ని విమానాలను నడిపేందుకు సిద్ధంగా ఉన్నట్లు సంస్థ వెల్లడించింది.

## క్రియేటర్లకు న్యాయమైన వాటా ఇవ్వాలి: విజయసాయి రెడ్డి

- విదేశీ సామాజిక మాధ్యమాలపై విమర్శలు
- స్వదేశీ వేదిక అవసరమని సూచన
- కఠిన నిబంధనలు తీసుకురావాలని విజ్ఞప్తి



**న్యూఢిల్లీ:** సామాజిక మాధ్యమ వేదికలపై రాత్రింబవళ్లు శ్రమిస్తూ కంటెంట్ సృష్టిస్తున్న భారతీయులకు తగిన ఆర్థిక ప్రయోజనం అందడం లేదని రాజ్యసభ మాజీ సభ్యుడు విజయసాయి రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి అంతర్జాతీయ సంస్థలు భారతీయుల ప్రతిభను తక్కువ ధరకు వినియోగించుకుంటూ, ప్రకటనల ద్వారా వచ్చే భారీ ఆదాయాన్ని తమ వద్దే నిలుపుకుంటున్నాయని ఆయన విమర్శించారు. యూట్యూబ్ ప్రకటనల ఆదాయంలో గణనీయమైన శాతం క్రియేటర్లకు అందజేస్తుండగా, మరికొన్ని వేదికలు సృష్టికర్తలకు తగిన ప్రతిఫలం ఇవ్వకపోవడం అన్యాయమని ఆయన పేర్కొన్నారు. విదేశీ సంస్థలు తమ విధానాన్ని మార్చుకోకపోతే, భారతదేశానికి సొంతంగా ఒక సామాజిక మాధ్యమ వేదిక అవసరమని అభిప్రాయపడ్డారు. స్వదేశీ యాప్‌లు అభివృద్ధి చెందితే దేశ సంపద దేశంలోనే నిలిచిపోతుందని, సృష్టికర్తలకు మేలు జరుగుతుందని తెలిపారు.

ఈ అంశంపై కేంద్ర సమాచార సాంకేతిక శాఖ మంత్రి తక్షణమే జోక్యం చేసుకోవాలని విజయసాయి రెడ్డి కోరారు. గతంలో సృష్టికర్తల పక్షాన మంత్రి స్పందించిన విషయాన్ని గుర్తు చేస్తూ, వారి ఆర్థిక భద్రత కోసం చట్టబద్ధమైన కఠిన నిబంధనలు తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. డిజిటల్ యుగంలో సృష్టికర్తలే దేశ ఆర్థిక వ్యవస్థకు బలమైన ఆధారం అని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ రంగంలో లేదా స్వదేశీ భాగస్వామ్యంతో కొత్త వేదికలను ప్రోత్సహించే సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. సృష్టికర్తల హక్కులను పరిరక్షించడం ప్రభుత్వ బాధ్యత అని విజయసాయి రెడ్డి తెలిపారు.

## అగర్తలాలో ఆపరేషనల్ సిద్ధతపై సమీక్ష

- ఆల్బర్ట్ ఎక్కా బ్రిగేడ్ సిద్ధత పరిశీలన
- ఉన్నత మనోబలం పై ప్రశంసలు
- త్రిపురలో భద్రతా ఏర్పాట్ల సమీక్ష



**అగర్తల:** భారత సైన్యానికి చెందిన స్పియర్ కార్ప్స్ ప్రధాన అధికారి అభిజిత్ ఎస్ పెంధార్కర్ త్రిపుర రాష్ట్ర రాజధాని అగర్తలలోని ఆల్బర్ట్ ఎక్కా బ్రిగేడ్ ఆపరేషనల్ సిద్ధతను సమీక్షించారు. ప్రస్తుత భద్రతా పరిస్థితుల దృష్ట్యా దళాల తయారీ, కార్యాచరణ సామర్థ్యాలపై సమగ్రంగా అవగాహన పొందారు. ఈ సందర్భంగా సైనికుల ఉన్నత మనోబలం, క్రమశిక్షణ, అంకిత భావాన్ని ఆయన ప్రశంసించారు. కఠిన పరిస్థితుల్లోనూ తమ విధులను సమర్థంగా నిర్వర్తిస్తున్నారని పేర్కొన్నారు. దేశ రక్షణలో అప్రమత్తత, సిద్ధత అత్యంత ముఖ్యమని సూచించారు. భద్రతా ఏర్పాట్లు, కార్యాచరణ ప్రణాళికలపై అధికారులు వివరణ ఇచ్చారు. సరిహద్దు ప్రాంతాల్లో శాంతి భద్రతలు కాపాడేందుకు తీసుకుంటున్న చర్యలను ఆయన పరిశీలించారు. అవసరమైన మార్గదర్శకాలను అందించారు. దేశ భద్రతకు కట్టుబడి ఉన్న ప్రతి సైనికుడి సేవలు గౌరవనీయమని పేర్కొంటూ, అదే ఉత్సాహంతో ముందుకు సాగాలని సూచించారు. దళాల సమన్వయం, సిద్ధత దేశ రక్షణకు బలమైన పునాది అని తెలిపారు.





## ఐఎన్ఎస్ విక్రాంత్‌కు వెయ్యి సురక్షిత విమాన దిగ్వేతలు

- యుద్ధ సిద్ధతకు ప్రతీకగా ఘనత
- అహర్నిశలు శ్రమించిన నౌకాదళ బృందం
- కమాండర్ అభినందనలు

**న్యూఢిల్లీ, మార్చి 3 (తెలంగాణ ముచ్చట్లు):** భారత నౌకాదళానికి చెందిన తొలి స్వదేశీ విమాన వాహక నౌక ఐఎన్ఎస్ విక్రాంత్ కీలక మైలురాయిని చేరుకుంది. ఈ నౌకపై నుంచి విమానాల వెయ్యి సురక్షిత దిగ్వేతలు విజయవంతంగా పూర్తయ్యాయి. ఉదయం ప్రారంభమైన విమాన ప్రయాణాల నుంచి అర్ధరాత్రి వరకు సాగిన సుదీర్ఘ కార్యాచరణలో ఈ ఘనత సాధించడం విశేషంగా నిలిచింది. యుద్ధ సిద్ధత, సాంకేతిక నైపుణ్యం, సమన్వయం కలిసొచ్చినప్పుడే ఇలాంటి విజయాలు సాధ్యమవుతాయని నౌకాదళ వర్గాలు పేర్కొన్నాయి. ప్రతి దిగ్వేత అత్యంత జాగ్రత్తతో, క్షణక్షణం పర్యవేక్షణలో జరిగిందని తెలిపారు.

సముద్రంలో కదులుతున్న నౌకపై విమానాన్ని సురక్షితంగా దిగ్వేయడం అత్యంత క్లిష్టమైన ప్రక్రియగా భావిస్తారు. ఈ సందర్భంగా పశ్చిమ నౌకాదళాధిపతి రియర్ అడ్మిరల్ వివేక్ దహియా బృందాన్ని అభినందించారు. విక్రాంత్ నౌకపై విధులు నిర్వహిస్తున్న స్క్వాడ్రన్‌ల సమన్వయం, అంకితభావం ప్రశంసనీయమని అన్నారు. ఈ విజయంతో నౌకాదళం మరింత యుద్ధ సిద్ధతను ప్రదర్శించిందని వ్యాఖ్యానించారు. వెయ్యి సురక్షిత దిగ్వేతల మైలురాయి భారత సముద్ర రక్షణలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించినట్లుగా నిపుణులు భావిస్తున్నారు. భవిష్యత్తులో మరింత సాంకేతిక పురోగతితో దేశ రక్షణను బలోపేతం చేయడానికి ఈ విజయాలు దోహదపడతాయని విశ్లేషిస్తున్నారు.





## రూ. 5,083 కోట్ల రక్షణ ఒప్పందాలకు ముద్ర

- తీర రక్షణ దళానికి ఆరు ఆధునిక హెలికాప్టర్లు
- నౌకాదళానికి ఉపరితల-నుంచి-ఆకాశ క్షిపణులు
- దక్షిణ బ్లాక్‌లో ఒప్పందాల కుదుర్చింపు



**న్యూఢిల్లీ:** రక్షణ మంత్రిత్వ శాఖ మొత్తం రూ. 5,083 కోట్ల విలువైన కీలక ఒప్పందాలను కుదుర్చుకుంది. భారత తీర రక్షణ దళం కోసం ఆరు ఆధునిక తేలికపాటి హెలికాప్టర్లు రెండో సంచిక సముద్ర విధుల కోసం కొనుగోలు చేయనున్నారు. అలాగే భారత నౌకాదళం కోసం ఉపరితలనుంచిఆకాశ దిశగా ప్రయోగించే నిలువు ప్రయోగ క్షిపణి వ్యవస్థలను కూడా పొందనున్నారు. ఈ ఒప్పందాలు న్యూఢిల్లీలోని దక్షిణ బ్లాక్‌లో రక్షణ కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్ సమక్షంలో కుదిరినట్లు రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఈ కొనుగోళ్లు సముద్ర భద్రతను మరింత బలోపేతం చేయడంలో కీలకంగా నిలవనున్నాయి.

ఆధునిక తేలికపాటి హెలికాప్టర్లు సముద్ర గస్తీ, గగన పరిశీలన, శోధన మరియు రక్షణ చర్యల్లో వినియోగించబడనున్నాయి. ఉపరితలనుంచిఆకాశ క్షిపణి వ్యవస్థలు శత్రు వైమానిక ముప్పులను సమర్థంగా ఎదుర్కొనే సామర్థ్యాన్ని నౌకాదళానికి అందిస్తాయి. దేశ రక్షణ సామర్థ్యాన్ని పెంపొందించడంలో ఈ ఒప్పందాలు ముఖ్యపాత్ర పోషిస్తాయని అధికారులు పేర్కొన్నారు. స్వదేశీ తయారీ సామర్థ్యానికి కూడా ఇవి ఊతమివ్వనున్నాయని రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

## ముండాలీలో వీరులకు ఘన నివాళి

- సీఐఎస్ఎఫ్ ప్రధాన అధికారి నివాళి
- పూర్తి గౌరవాలతో నిర్వహించిన కార్యక్రమం
- వీరుల త్యాగానికి కృతజ్ఞతాభివందనం





**భువనేశ్వర్:** ఒడిశాలోని ముండాలీ కేంద్రీయ శిక్షణ కేంద్రంలో ఏర్పాటు చేసిన వీరుల స్మారక స్థూపం వద్ద కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం ప్రధాన అధికారి ప్రవీర్ రంజన్ పుష్పగుచ్ఛం సమర్పించి నివాళులర్పించారు. విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన వీరుల సేవలను స్మరించుకుంటూ ఈ కార్యక్రమం పూర్తి గౌరవాలతో నిర్వహించారు. స్మారక స్థూపం వద్ద నిర్వహించిన ఈ వేడుకలో దళానికి చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. దేశ రక్షణలో తమ ప్రాణాలను అర్పించిన వీరుల త్యాగం అమరమని ప్రధాన అధికారి పేర్కొన్నారు. వారి సేవలను ఎప్పటికీ మరువబోమని తెలిపారు. సీఐఎస్ఎఫ్ దళం తమ వీరుల వారసత్వాన్ని గౌరవంగా కొనసాగిస్తుందని స్పష్టం చేసింది. గర్వంతో, అంకితభావంతో, అత్యున్నత సేవా ప్రమాణాలతో విధులు నిర్వర్తించడం ద్వారా వారికి నిజమైన నివాళి అర్పిస్తామని వెల్లడించింది. దేశ భద్రతకు కట్టుబడి పనిచేసే ప్రతి సిబ్బందికి ఈ వీరుల త్యాగం స్ఫూర్తిదాయకమని అధికారులు పేర్కొన్నారు. విధి నిర్వహణలో అప్రమత్తత, నిబద్ధతతో ముందుకు సాగుతామని స్పష్టం చేశారు.

## మినాబ్‌లో విషాదం: 165 బాలికల సమాధులు ఒకేచోట

- వైమానిక దాడుల్లో పాఠశాలపై ప్రభావం
- 180 మృతుల్లో 165 మంది బాలికలు
- సామూహిక అంత్యక్రియలపై అంతర్జాతీయ ఆందోళన

**టెహ్రాన్:** అమెరికా-ఇజ్రాయెల్ వైమానిక దాడుల నేపథ్యంలో ఇరాన్‌లోని మినాబ్ ప్రాంతంలో చోటుచేసుకున్న విషాద ఘటన ప్రపంచాన్ని కలచివేసింది. అక్కడి ఓ పాఠశాలపై దాడి జరగడంతో మొత్తం 180 మంది మృతిచెందినట్లు సమాచారం. ఇందులో 165 మంది బాలికలే ఉన్నట్లు ఇరాన్ అధికారులు వెల్లడించారు. మృతులందరినీ ఒకేచోట సమాధి చేసినట్లు సమాచారం. ఇందుకోసం పెద్ద సంఖ్యలో గోతులు తవ్విన దృశ్యాలను ఇరాన్ మంత్రి అబ్బాస్ విడుదల చేసినట్లు వార్తలు వచ్చాయి. ఈ ఘటన దేశవ్యాప్తంగా ఆవేదన కలిగించడంతో పాటు అంతర్జాతీయ స్థాయిలో తీవ్ర ప్రతిస్పందనలు రేకెత్తిస్తోంది. పిల్లలపై జరిగిన ఈ దాడిని ఇరాన్ ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. నిరపరాధుల ప్రాణనష్టంపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అంతర్జాతీయ వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి. సంఘటనపై పూర్తి వివరాలు వెలుగులోకి రావాల్సి ఉంది.

మినాబ్ ఘటనతో ప్రాంతంలో ఉద్రిక్తతలు మరింత పెరిగే అవకాశముందని విశ్లేషకులు భావిస్తున్నారు. శాంతి చర్చలే సమస్యకు పరిష్కారమని, నిరపరాధుల ప్రాణాలను కాపాడేందుకు అంతర్జాతీయ సమాజం తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు.



తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక
బుధవారం - 04 - ఫిబ్రవరి 2026


# ఐఫోన్ 17 ఈ మార్కెట్‌లోకి



**ముంబై– 03 మార్చి( తెలంగాణ ముచ్చట్లు):**

ప్రపంచ స్మార్ట్‌ఫోన్ రంగంలో అగ్రగామిగా నిలిచిన ఆపిల్ తన కొత్త శ్రేణిని విస్తరిస్తూ ఐఫోన్ 17ఈ ను అధికారికంగా విడుదల చేసింది. తక్కువ ధరలో ఆధునిక సౌకర్యాలతో ఐఫోన్ అనుభూతిని అందించాలనే లక్ష్యంతో ఈ నమూనాను రూపొందించినట్లు సంస్థ తెలిపింది. భారత మార్కెట్‌లో 256 జీబీ మోడల్ ధర రూ. 64,900గా, 512 జీబీ మోడల్ ధర రూ. 84,900గా నిర్ణయించారు. మార్చి 11 నుంచి విక్రయాలు ప్రారంభం కానున్నాయి. నలుపు, తెలుపు, మృదువైన గులాబీ రంగుల్లో ఇది అందుబాటులో ఉంటుంది.

ఈ ఫోన్‌లో సంస్థ రూపొందించిన అత్యాధునిక ఏ19 చిప్‌సెట్‌ను వినియోగించారు. మూడు నానోమీటర్ల సాంకేతికతతో రూపొందిన ఈ ప్రాసెసర్ వేగవంతమైన పనితీరును అందిస్తుందని కంపెనీ పేర్కొంది. అయితే ప్రధాన నమూనాతో పోలిస్తే ఇందులో నాలుగు కోర్ గ్రాఫిక్స్ యంత్రాంగం మాత్రమే ఉంది. ఆరు దశాంశం ఒక అంగుళాల ఒలెడ్ తెర, పాత తరహా నాచ్ రూపకల్పన, అరవై హెర్ట్జ్ రిఫ్రెష్ రేటు వంటి లక్షణాలు ఇందులో ఉన్నాయి.

ఫోటోగ్రఫీ పరంగా వెనుక భాగంలో 48 మెగాపిక్సెల్ ప్రధాన కెమెరా అందించారు. నాలుగు కే స్పష్టతతో దృశ్యాలను చిత్రీకరించవచ్చు. ముందు భాగంలో 12 మెగాపిక్సెల్ స్వీయ చిత్ర కెమెరా ఉంది. ఒక్కసారి ఛార్జ్ చేస్తే 26 గంటల వరకు వీడియో వీక్షణ సౌకర్యం లభిస్తుందని సంస్థ వెల్లడించింది.

ఇదే శ్రేణిలో ఉన్న ఐఫోన్ 17 తో పోలిస్తే కొన్ని తేడాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ప్రధాన నమూనాలో డైనమిక్ ఐలాండ్ రూపకల్పన, 120 హెర్ట్జ్ రిఫ్రెష్ రేటు, 12 జీబీ మెమరీ వంటి అధిక సౌకర్యాలు ఉంటే, 17ఈలో ఎనిమిది జీబీ మెమరీ మాత్రమే ఉంది. అలాగే ద్వంద్వ కెమెరా అమరిక బదులుగా ఒక్క కెమెరానే అందించారు.

సాధారణ వినియోగదారులు, సామాజిక మాధ్యమాలు, సందేశాల పంపకం, సాధారణ ఫోటోల కోసం ఫోన్ ఉపయోగించే వారికి ఇది అనుకూల ఎంపికగా భావిస్తున్నారు. అయితే అధిక సామర్థ్యంతో గేమింగ్ చేయాలనుకునే వారు లేదా అత్యుత్తమ దృశ్య అనుభవం కోరుకునే వారికి ఇతర ఉన్నత నమూనాలు మెరుగైన ఎంపికగా ఉండవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. బ్రాండ్ విలువ, దీర్ఘకాలిక సాఫ్ట్‌వేర్ నవీకరణలు కోరుకునే వారికి ఈ ఫోన్ సమతుల్య ఎంపికగా నిలుస్తుందని మార్కెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# తెలుగు రాష్ట్రాల్లో ప్యారాచూట్ ఆమ్లా




**విజయవాడ – 03 మార్చి (తెలంగాణ ముచ్చట్లు)**

వ్యక్తిగత సంరక్షణ ఉత్పత్తుల రంగంలో ప్రముఖ సంస్థ మ్యారికో లిమిటెడ్ తన ప్రఖ్యాత బ్రాండ్ ప్యారాచూట్ అడ్వాన్స్‌డ్ పరిధిలో కొత్తగా 'ప్యారాచూట్ అడ్వాన్స్‌డ్ ఆమ్లా' హెయిర్ ఆయిల్‌ను ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మార్కెట్లలో ప్రవేశపెట్టింది. సంప్రదాయంగా భారతీయ కుటుంబాల్లో ఉసిరికాయకు ఉన్న ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుని ఈ ఉత్పత్తిని రూపొందించినట్లు సంస్థ వెల్లడించింది. ఉసిరి సారంతో పాటు కొబ్బరి నూనె పోషణ, విటమిన్‌ఈ, రోజ్మేరీ వంటి ఆధునిక కేశ సంరక్షణ పదార్థాలను మేళవించి ప్రత్యేక ఫార్ములాతో ఈ నూనెను తయారు చేసినట్లు కంపెనీ తెలిపింది. జుట్టు కుదుళ్లను బలపరచడం, సహజ నలుపు మెరుపును కాపాడడం, జుట్టు రాలడాన్ని తగ్గించడం వంటి ప్రయోజనాలు అందిస్తుందని సంస్థ ధీమా వ్యక్తం చేసింది.

ఈ ప్రారంభోత్సవ సందర్భంగా సంస్థ భారత విభాగ ప్రధాన అధికారి ఆషిష్ గుప్తా మాట్లాడుతూ, సంప్రదాయం మరియు ఆధునిక విజ్ఞానాన్ని కలిపిన ఉత్పత్తిగా దీన్ని తీసుకువచ్చామని తెలిపారు. తెలుగు రాష్ట్రాలు తమకు కీలక మార్కెట్లు కావడంతో ఇక్కడి వినియోగదారుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ముందుగా ఈ ప్రాంతంలోనే విడుదల చేస్తున్నామని పేర్కొన్నారు. సామాన్య వినియోగదారులందరికీ అందుబాటులో ఉండేలా 70 మిల్లీలీటర్ల ప్యాక్ ధరను కేవలం రూ. 20గా నిర్ణయించడం విశేషం. సాధారణ కిరాణా దుకాణాలతో పాటు ఆధునిక విక్రయ కేంద్రాల్లో కూడా ఈ ఉత్పత్తి లభ్యమవుతోంది. తక్కువ ధర, మెరుగైన గుణాత్మకతతో ఈ కొత్త ఆమ్లా నూనె హెయిర్ కేర్ విభాగంలో కొత్త ప్రమాణాలు సృష్టిస్తుందని మార్కెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# పీఎఫ్ వడ్డీ 8.25 శాతం యథాతథం

**న్యూఢిల్లీ – 03 మార్చి( తెలంగాణ ముచ్చట్లు):**

ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ 2025-26 ఆర్థిక సంవత్సరానికి పీఎఫ్ డిపాజిట్లపై వడ్డీ రేటును 8.25 శాతంగా ఖరారు చేసింది. వరుసగా మూడో ఏడాది కూడా ఇదే వడ్డీ రేటును కొనసాగిస్తూ నిర్ణయం తీసుకుంది. గత ఆర్థిక సంవత్సరమైన 2024-25కు కూడా ఇదే 8.25 శాతం వడ్డీని అమలు చేసిన విషయం తెలిసిందే.




2022-23 సంవత్సరంలో 8.15 శాతంగా ఉన్న వడ్డీ రేటును 2023-24లో 8.25 శాతానికి స్వల్పంగా పెంచిన సంస్థ, ఆ తరువాతి రెండేళ్లుగా అదే రేటును యథాతథంగా కొనసాగిస్తోంది. కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి మాన్సుఖ్ మాండవీయ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర ట్రస్టీల మండలి 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఈ వడ్డీ రేటును సిఫార్సు చేసినట్లు మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

కేంద్ర ప్రభుత్వం అధికారిక ఆమోదం ప్రకటించిన అనంతరం సభ్యుల ఖాతాల్లో వడ్డీ మొత్తాన్ని జమ చేయనున్నట్లు సంస్థ స్పష్టం చేసింది. దేశవ్యాప్తంగా కోట్లాది ఉద్యోగులకు ఈ నిర్ణయం ఉపశమనం కలిగించే అంశంగా భావిస్తున్నారు. స్థిరమైన వడ్డీ రేటు కొనసాగింపు ద్వారా ఉద్యోగుల పొదుపులకు భద్రత కల్పించడమే లక్ష్యమని అధికారులు తెలిపారు.

ఇదిలా ఉండగా, నిర్వహణలో లేని ఖాతాల మూసివేతకు సంబంధించి ఒక పైలట్ ప్రాజెక్టుకు కూడా ట్రస్టీల మండలి ఆమోదం తెలిపింది. వెయ్యి రూపాయల లోపు క్లెయిమ్ చేసుకోని నిల్వలున్న ఖాతాలకు సంబంధించి ఎటువంటి దరఖాస్తు అవసరం లేకుండా నేరుగా సభ్యుల ఖాతాల్లోనే డబ్బు జమ చేసే విధానాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నారు. ఈ పద్ధతి విజయవంతమైతే, వెయ్యి రూపాయలకు పైగా నిల్వలున్న ఖాతాలకు కూడా దీన్ని విస్తరించే యోచనలో సంస్థ ఉన్నట్లు సమాచారం.

పీఎఫ్ వడ్డీ రేటు యథాతథంగా కొనసాగించడంపై ఉద్యోగ సంఘాలు మిశ్రమ స్పందన వ్యక్తం చేస్తున్నాయి. కొందరు స్థిరత్వాన్ని స్వాగతిస్తుండగా, మరికొందరు మరింత పెంపు అవసరమని అభిప్రాయపడుతున్నారు. అయినప్పటికీ, వరుసగా మూడో ఏడాది 8.25 శాతం వడ్డీ కొనసాగింపుతో పీఎఫ్ సభ్యులకు స్థిరమైన లాభం లభించనుంది.

# ఎగుమతులపై యుద్ధ ప్రభావం

**న్యూఢిల్లీ – 03 మార్చి( తెలంగాణ ముచ్చట్లు):**

పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు అంతర్జాతీయ వాణిజ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ముఖ్యంగా ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్త పరిస్థితులు, అమెరికా సంయుక్త రాష్ట్రాలు జోక్యంతో మరింత క్లిష్టంగా మారాయి. ఈ పరిణామాల ప్రభావం భారత ఎగుమతులపై స్పష్టంగా కనిపిస్తోంది. యూరప్‌కు వెళ్లే సరుకుల రవాణా మార్గాలు భద్రతా కారణాల వల్ల సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. సాధారణంగా భారత్ నుంచి యూరప్‌కు సరుకులు రెడ్ సీ, సూయెజ్ కాలువ మార్గం గుండా ప్రయాణిస్తాయి. అయితే ఈ ప్రాంతాల్లో భద్రతా ముప్పు పెరగడంతో అనేక అంతర్జాతీయ నౌకాయాన సంస్థలు ఆ మార్గాన్ని తాత్కాలికంగా తప్పించుకుంటున్నాయి. ముఖ్యంగా హోర్ముజ్ జలసంధి పరిసరాల్లో ఉద్రిక్తతలు అధికంగా ఉండటంతో సముద్ర రవాణాపై అనిశ్చితి నెలకొంది. దీంతో చాలా నౌకలు ఇప్పుడు ఆఫ్రికా ఖండం దక్షిణ అంచున ఉన్న కేప్ ఆఫ్ గుడ్ హోప్ చుట్టూ తిరిగి ప్రయాణిస్తున్నాయి. ఇది సంప్రదాయ మార్గంతో పోలిస్తే వేల నాటికల్ మైళ్ల దూరం ఎక్కువ.




ఫలితంగా ప్రయాణ సమయం సాధారణంగా 10 నుంచి 20 రోజుల వరకు పెరిగింది. ఈ మార్పు వల్ల సముద్ర రవాణా ఖర్చులు 40 నుంచి 50 శాతం వరకు పెరిగినట్లు వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. ఇంధన వినియోగం, నౌక సిబ్బంది ఖర్చులు, బీమా ప్రీమియంలు, యుద్ధ ప్రమాద ఛార్జీలు వంటి అంశాలు కూడా పెరిగాయి. ఈ అదనపు భారాన్ని నౌకాయాన సంస్థలు నేరుగా ఎగుమతిదారులపై మోపుతున్నాయి. ఉదాహరణకు నావా శెవా పోర్ట్ నుంచి ఉత్తర యూరప్‌కు ఒక 20 అడుగుల కంటెయినర్‌ను పంపేందుకు గతంలో 1,200 నుంచి 1,800 డాలర్ల మధ్య ఖర్చయ్యేది. ప్రస్తుతం అదే కంటెయినర్‌కు 2,500 డాలర్లకు పైగా వ్యయం అవుతోంది. ఈ పరిస్థితి భారత ఎగుమతిదారులకు పెద్ద సవాల్‌గా మారింది. సరుకులు ఆలస్యంగా చేరడంతో ఒప్పందాల గడువులు తప్పిపోతున్నాయి. స్థిర ధరల ఒప్పందాలపై పనిచేసే ఎగుమతిదారులు పెరిగిన ఖర్చును భరించలేక నష్టాలను ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా బాస్మతి బియ్యం, వ్యవసాయ ఉత్పత్తులు, తయారీ రంగ సరుకుల ఎగుమతుల్లో ఇబ్బందులు అధికంగా కనిపిస్తున్నాయి. ప్రపంచ కంటెయినర్ వాణిజ్యంలో కీలకమైన రెడ్ సీ మార్గం దెబ్బతినడంతో సరుకు కొరత, ధరల పెరుగుదల వంటి ప్రభావాలు ప్రపంచవ్యాప్తంగా కనిపిస్తున్నాయి. ఈ ఉద్రిక్తతలు కొనసాగితే రవాణా వ్యయాలు మరింత పెరిగే అవకాశం ఉందని, తద్వారా భారత ఎగుమతుల పోటీ సామర్థ్యం దెబ్బతినే ప్రమాదం ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# విమాన టికెట్ ధరలు ఆకాశమే హద్దు

**హైదరాబాద్– 03 మార్చి( తెలంగాణ ముచ్చట్లు):**

ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధ పరిస్థితుల ప్రభావంతో అంతర్జాతీయ విమాన ప్రయాణాలపై తీవ్ర ప్రభావం పడింది. పలు విమానయాన సంస్థలు తమ సర్వీసులను రద్దు చేయడంతో పాటు మిగిలిన సర్వీసుల టికెట్ ధరలను భారీగా పెంచాయి. ముఖ్యంగా హైదరాబాద్ నుంచి లండన్, ఫ్రాంక్‌ఫర్ట్, న్యూయార్క్ వంటి ప్రధాన గమ్యస్థానాలకు వెళ్లే ప్రయాణికులు భారీ ధరలతో ఇబ్బందులు పడుతున్నారు. హైదరాబాద్ నుంచి లండన్ వెళ్లే విమాన టికెట్ ధరలు సాధారణంగా ఉండే స్థాయికి రెట్టింపు అయ్యాయి. ప్రస్తుతం టికెట్లు రూ.65 వేల నుంచి రూ.90 వేల వరకు విక్రయిస్తున్నట్లు ట్రావెల్ వర్గాలు వెల్లడిస్తున్నాయి. అలాగే జర్మనీకి వెళ్లే




విమానాల ధరలు 200 శాతం నుంచి 300 శాతం వరకు పెరిగినట్లు సమాచారం. ఇది మధ్యతరగతి ప్రయాణికులకు తీవ్ర భారం అయ్యింది. అమెరికాకు వెళ్లే ప్రయాణికుల పరిస్థితి కూడా భిన్నంగా లేదు. హైదరాబాద్ నుంచి ఇథియోపియా మార్గం ద్వారా న్యూయార్క్ వెళ్లే విమాన టికెట్ ధర సుమారు రూ.1.5 లక్షల వరకు చేరినట్లు తెలుస్తోంది. అత్యవసర అవసరాల కోసం ప్రయాణించాల్సిన వారు ఈ పెరిగిన ధరలతో ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు.

ఇక యూఏఈకు వెళ్లే విమాన సర్వీసులు భారీగా రద్దయ్యాయి. సోమవారం ఒక్క రోజే దాదాపు 50 సర్వీసులు రద్దు కాగా, బెంగళూరు, ఢిల్లీ, కోలకతా విమానాశ్రయాల నుంచి కూడా అనేక సర్వీసులు నిలిపివేయబడ్డాయి. హైదరాబాద్ నుంచి ప్రతిరోజూ వేల సంఖ్యలో యూఏఈకి వెళ్లే ప్రయాణికులు ఉండటంతో, ఈ రద్దులు వారిపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. యుద్ధ పరిస్థితులను కొన్ని విమానయాన సంస్థలు లాభాల కోసం వినియోగించుకుంటున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఇంధన వ్యయం, మార్గ మార్పులు, భద్రతా చర్యలు వంటి కారణాల వల్లే ధరలు పెరిగాయని సంస్థలు వివరణ ఇస్తున్నాయి. ఏదేమైనా, ప్రస్తుత పరిస్థితుల్లో విమాన ప్రయాణం సాధారణ ప్రజలకు భారంగా మారిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# ఓలా షేరు పతనం.. పెట్టుబడిదారులకు భారీ దెబ్బ

**ముంబై– 03 మార్చి( తెలంగాణ ముచ్చట్లు):**

ఒకప్పుడు భారీ అంచనాలతో మార్కెట్లోకి అడుగుపెట్టిన ఓలా సంస్థ షేరు ఇప్పుడు పెట్టుబడిదారులకు పీడకలగా మారింది. ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయి రూ.157 నుంచి దాదాపు 86 శాతం క్షీణించి ప్రస్తుతం రూ.21 పరిధిలో ట్రేడవుతోంది. ఈ ఆకస్మిక పతనం చిన్న, మధ్య తరగతి పెట్టుబడిదారులను తీవ్ర ఆందోళనకు గురిచేసింది. సోమవారం ట్రేడింగ్‌లో ఒక్కరోజే దాదాపు 16 శాతం వరకు షేరు క్షీణించింది. గత ముగింపు ధర రూ.25.22 నుంచి రూ.21.21 వరకు పడిపోయిన ఈ షేరు, మార్కెట్ ముగిసే సమయానికి స్వల్పంగా కోలుకుని రూ.24 వద్ద నిలిచింది. అయినప్పటికీ మార్కెట్ మూలధనం గణ



నీయంగా క్షీణించి సుమారు రూ.10,568 కోట్లకు పరిమితమైంది. గత ఒక నెలలో 26 శాతం, ఏడాది కాలంలో 58 శాతం పతనం నమోదైంది. అదే సమయంలో సానుకూల రాబడిని చూపడం గమనార్హం. 2024 ఆగస్టు 9న రూ.76 ఇష్యూ ధర వద్ద లిస్టింగ్ అయిన ఈ షేరు, ఆగస్టు 20న రూ.157.53 గరిష్ఠ స్థాయిని తాకింది. ఆ వేగవంతమైన ఎగబాకడం తరువాత, ఇప్పుడు తీవ్రమైన పతనంగా మారింది. మార్కెట్ నిపుణుల అభిప్రాయం ప్రకారం కంపెనీ ఆర్థిక ఫలితాలు పెట్టుబడిదారుల విశ్వాసాన్ని దెబ్బతీశాయి. మూడవ త్రైమాసిక ఆర్థిక ఫలితాల ప్రకారం కంపెనీ రూ.470 కోట్ల ఆదాయం ఆర్జించినప్పటికీ, నికర నష్టం రూ.487 కోట్లు నమోదైంది. అంటే ఆదాయాన్ని మించిన నష్టాలు చవిచూసినట్లైంది. అమ్మకాలు మందగించడం, వ్యయభారం పెరగడం వంటి అంశాలు సంస్థ ఆర్థిక స్థితిపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. అమ్మకాలను ప్రోత్సహించేందుకు సంస్థ 'ఓలా ఇన్‌సైడర్స్' పేరుతో కమ్యూనిటీ కార్యక్రమాన్ని ప్రారంభించింది. కొత్త తరం ఎస్1 స్కూటర్, రోడ్‌స్టర్ మోటార్‌సైకిల్ కొనుగోలుపై భారీ తగ్గింపులు, రిఫరల్ ప్రయోజనాలు ప్రకటించినప్పటికీ మార్కెట్ విశ్వాసాన్ని తిరిగి పొందడంలో పెద్దగా ఫలితం కనిపించలేదు. ఇక రిటైల్ నెట్‌వర్క్ విషయంలోనూ కంపెనీ వెనుకడుగు వేస్తోంది. ఒకప్పుడు దేశవ్యాప్తంగా దాదాపు 4,000 ఆఫ్‌లైన్ దుకాణాలు ఉన్నప్పటికీ, 2025 డిసెంబర్ నాటికి అవి 700కు తగ్గాయి. మార్చి చివరికి 550 మాత్రమే మిగిలే అవకాశముందని నివేదికలు చెబుతున్నాయి. దుకాణాల మూసివేతలతో పాటు ఉద్యోగుల తొలగింపులు కూడా కొనసాగుతున్నట్లు సమాచారం. మొత్తంగా, భారీ ఆశలతో పెట్టుబడులు పెట్టిన వారికి ఈ షేరు తీవ్ర నష్టాలను మిగిల్చిందని మార్కెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

బుధవారం - 04 - మార్చి 2026

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# థియేటర్లలో యావరేజ్ హిట్... ఇప్పుడు ఓటీటీలోకి ఫంకీ

మాస్ కా దాస్ విశ్వక్ సేన్, దర్శకుడు అనుదీప్ కె.వి. కాంబినేషన్‌లో తెరకెక్కిన రొమాంటిక్ కామెడీ చిత్రం 'ఫంకీ' ఇప్పుడు ఓటీటీ స్ట్రీమింగ్‌కు సిద్ధమవుతోంది. ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ఫిబ్రవరి 13న విడుదలైన ఈ సినిమా ప్రధానంగా వినోదాన్నిలక్ష్యంగా చేసుకుని రూపొందింది. విడుదలకు ముందు నుంచే కథలో లాజిక్ కంటే వినోదమే ముఖ్యమని నిర్మాత సూర్యదేవర నాగవంశీ ప్రచారంలో పేర్కొనడం విశేషం. సినిమాలో విశ్వక్ సేన్ కామెడీ టైమింగ్, యాక్షన్ ఎపిసోడ్లు, హీరోయిన్ కయాదు లోహర్ గ్లామర్, దర్శకుడు అనుదీప్ స్టైల్ డైలాగులు ప్రధాన ఆకర్షణలుగా నిలిచాయి. కథ పరంగా పెద్దగా ప్రభావం చూపకపోయినా వినోదం కారణంగా ప్రేక్షకుల నుంచి మోస్తరు స్పందన లభించింది.ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రం సుమారు రూ.14.5 కోట్ల గ్రాస్, దాదాపు రూ.8 కోట్ల షేర్ వసూలు చేసింది. అయితే బ్రేక్ ఈవెన్ సాధించాలంటే రూ.20 కోట్ల షేర్ అవసరం ఉండడంతో ఆ లక్ష్యాన్ని చేరుకోలేకపోయిందని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి.ఇప్పుడు ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్‌కు సిద్ధమైంది. 'ఫంకీ' చిత్ర డిజిటల్ హక్కులను ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్ దక్కించుకున్నట్లు సమాచారం. మార్చి 12 లేదా 13 తేదీల్లో స్ట్రీమింగ్ ప్రారంభమయ్యే అవకాశం ఉందని టాక్ వినిపిస్తోంది. దీనిపై త్వరలో అధికారిక ప్రకటన వచ్చే అవకాశముంది. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించారు. నరేష్, సంపత్ రాజ్, మురళీధర్ గౌడ్, వీటీవీ గణేష్ తదితరులు కీలక పాత్రల్లో నటించగా, సంగీతాన్ని భీమ్స్ సిసిరోలియో అందించారు. ఇదిలా ఉండగా విశ్వక్ సేన్ తదుపరి చిత్రం 'కల్ట్'పై దృష్టి పెట్టాడు. ఈ హై ఓల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌కు స్వయంగా ఆయనే దర్శకత్వం వహిస్తున్నాడు. థియేటర్లలో మోస్తరు విజయాన్ని అందుకున్న 'ఫంకీ' ఓటీటీలో ప్రేక్షకులను ఎంతవరకు అలరిస్తుందో చూడాలి.



# విజయం కోసం శ్రీలీల ఎదురుచూపు

తెలుగు చిత్రసీమలో తక్కువ సమయంలోనే ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న యువ నటి శ్రీలీల ప్రస్తుతం తన కెరీర్‌లో కీలక దశను ఎదుర్కొంటున్నారు. అందం, నృత్యం, అభినయంతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఆమె ప్రారంభంలో వరుస అవకాశాలు అందుకుని దూసుకెళ్లారు. విద్యలోనూ మెరుగైన ప్రతిభ కనబరిచిన ఆమె, చదువుతో పాటు సినిమాలను సమతుల్యం చేస్తూ ముందుకు సాగడం విశేషంగా చెప్పుకోవాలి.

అయితే గత కొంతకాలంగా విడుదలైన చిత్రాలు ఆమెకు ఆశించిన స్థాయి విజయాన్ని అందించలేకపోయాయనే చర్చ సినీ వర్గాల్లో వినిపిస్తోంది. ముఖ్యంగా పుష్ప 2: ది రూల్ చిత్రంలోని 'కిస్సిక్' పాటతో ఆమె వార్తల్లో నిలిచినా, అది పూర్తిస్థాయి విజయానికి మార్గం సుగమం చేయలేదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అనంతరం విడుదలైన జూనియర్, మాస్ జాతర, రాబిన్ హుడ్ వంటి చిత్రాలు వాణిజ్యపరంగా పెద్దగా ప్రభావం చూపలేకపోయాయని అంటున్నారు. ఈ సినిమాల్లోని పాటలు, దుస్తులు, ఆమె నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నప్పటికీ, కథా బలం లోపించడంతో ఆ చిత్రాలు దీర్ఘకాల ప్రభావాన్ని చూపలేకపోయాయని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. దీంతో ఒక బలమైన కథ, గుర్తుండిపోయే పాత్ర ద్వారా భారీ విజయాన్ని సాధించాలని ఆమె అభిమానులు ఆశిస్తున్నారు.

ప్రస్తుతం శ్రీలీల 2026 సంవత్సరానికి సంబంధించిన ప్రాజెక్టుల ఎంపికలో మరింత జాగ్రత్తగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం. కథ, పాత్ర ప్రాధాన్యత, దర్శకుల ఎంపిక వంటి అంశాల్లో ఆలోచించి నిర్ణయాలు తీసుకుంటున్నారని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఒక గొప్ప విజయంతో మళ్లీ తన స్థానం మరింత బలపరుచుకోవాలని ఆమె సంకల్పించుకున్నట్లు తెలుస్తోంది. వచ్చే ఏడాది విడుదలయ్యే చిత్రాలే ఆమె కెరీర్‌కు కీలకంగా మారనున్నాయని పరిశ్రమలో చర్చ జరుగుతోంది.

# ఓటీటీలోకి 'విత్ లవ్'.. స్ట్రీమింగ్ ఎక్కడంటే..?




ఇటీవల థియేటర్లలో విడుదలై ప్రేక్షకులను ఆకట్టుకున్న క్యూట్ రొమాంటిక్ కామెడీ చిత్రం 'విత్ లవ్' ఇప్పుడు ఓటీటీ వేదికలోకి రాబోతోంది. థియేటర్లలో మంచి స్పందన అందుకున్న ఈ సినిమా డిజిటల్ రిలీజ్ కోసం ఎదురుచూస్తున్న ప్రేక్షకులకు చిత్ర బృందం శుభవార్త తెలిపింది.


ఈ చిత్రానికి సంబంధించిన డిజిటల్ హక్కులను ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్ భారీ ధరకు సొంతం చేసుకుంది. ఈ సినిమా మార్చి 6 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుందని మేకర్స్ ప్రకటించారు. తమిళంతో పాటు తెలుగు, హిందీ, మలయాళం, కన్నడ భాషల్లో కూడా ఈ సినిమా అందుబాటులోకి రానుంది.

'టూరిస్ట్ ఫ్యామిలీ' చిత్రంతో దర్శకుడిగా గుర్తింపు పొందిన అభిషన్ జీవింత్ ఈ సినిమాతో హీరోగా వెండితెరకు పరిచయం అయ్యాడు. ఆయన సరసన మలయాళ నటి అనస్వర రాజన్ హీరోయిన్‌గా నటించి ప్రేక్షకులను మెప్పించింది. ఈ చిత్రానికి మదన్ దర్శకత్వం వహించారు.

బ్లైండ్ డేట్‌లో కలిసిన సత్య, మనీషా అనే ఇద్దరు యువకులు ఒకే స్కూల్‌లో చదివినట్లు తెలుసుకోవడం, ఆ తర్వాత వారి స్కూల్ రోజుల జ్ఞాపకాలు, అప్పటి క్రష్‌లు, స్నేహాలు గుర్తు చేసుకుంటూ సాగిన కథ ప్రేక్షకులకు మంచి అనుభూతిని కలిగించింది. కేవలం 7 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లు సాధించి బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఇప్పుడు ఓటీటీలో కూడా ఇదే స్థాయి ఆదరణ పొందుతుందా అన్నది ఆసక్తికరంగా మారింది.

# సర్‌ప్రైజ్ బ్లాక్‌బస్టర్‌గా 'థాయ్ కిజావి'..



తమిళ సినీ పరిశ్రమలో ఇటీవలి కాలంలో పెద్ద సినిమాలు లేకపోవడం, తక్కువ బడ్జెట్ చిత్రాలు ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోవడం వల్ల థియేటర్లు ఖాళీగా కనిపిస్తున్నాయి. ఇలాంటి సమయంలో నటుడు శివకార్తికేయన్ నిర్మించిన కామెడీ డ్రామా 'థాయ్ కిజావి' కోలీవుడ్ ఎగ్జిబిటర్లకు ఆశాకిరణంగా మారింది. చిన్న బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం విడుదలైన మొదటి రోజు నుంచే మంచి స్పందన అందుకుని బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతోంది.

ఈ చిత్రంలో సీనియర్ నటి రాధికా శరత్‌కుమార్ ప్రధాన పాత్రలో నటించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. కుటుంబ నేపథ్యంతో పాటు వినోదాత్మకంగా సాగే కథ ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందిస్తోందని విమర్శకులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా రాధికా నటన, కామెడీ టైమింగ్ ప్రేక్షకుల నుంచి ప్రశంసలు అందుకుంటున్నాయి.

విడుదలైన మొదటి వారాంతంలోనే ఈ చిత్రం సుమారు రూ.22 కోట్ల వసూళ్లు సాధించి ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరిచింది. చిన్న బడ్జెట్ సినిమా కావడంతో ఈ కలెక్షన్లు మరింత విశేషంగా భావిస్తున్నారు. మంచి టాక్ రావడంతో థియేటర్లలో ఆక్యుపెన్సీ కూడా పెరుగుతూ ఉండటం విశేషం.

శివకుమార్ మురుగేశన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో రైచల్ రబేకా, అతడి కుమరన్, సంగపులి, మునిష్కాంత్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు. సంగీతాన్ని నివాస్ కె ప్రసన్న అందించారు. ప్రస్తుతం ఈ సినిమా కోలీవుడ్‌లో 'టాక్ ఆఫ్ ది టౌన్'గా మారి మంచి వసూళ్లతో ముందుకు సాగుతోంది.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in